జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | సోమవారం 3 మార్చి 2025 | సంపుటి : 15 | సంచిక : 182 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528




# పొదుపులో కుదుపు

**పడిపోతున్న కుటుంబ పొదుపు.. పెరుగుతున్న వ్యక్తిగత రుణాలు**

**2000లో మొత్తం పొదుపులో 84 శాతంగా ఉన్న కుటుంబ పొదుపు**

**2023 నాటికి 61 శాతానికి పడిపోయిన పొదుపు రేటు**

**10.01 శాతం నుంచి 5 శాతానికి పడిపోయిన జీఎస్‌డీపీలో పొదుపు రేటు**

**21 నుంచి 34 శాతానికి పెరిగిన కన్స్యూమర్ రుణాలు: వెల్లడించిన బ్లూమే రీసెర్చ్ నివేదిక**

**ప్రజాజ్యోతి అమరావతి:**

దేశంలో అప్పుల అప్పారావులు పెరిగిపోతున్నారు. పాత తరం పొదుపు మంత్రాన్ని జపిస్తే.. నేటి తరం పొదుపు కంటే అప్పులే ముద్దంటోంది. ముఖ్యంగా 2000 సంవత్సరం తర్వాత నుంచి పొదుపు తగ్గించి.. అప్పుచేసి మరీ వస్తువులను కొనుగోలు చేసే ట్రెండ్ పెరుగుతోంది. తాగాజా బ్లూమే రీసెర్చ్ విడుదల చేసిన నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. 2000 సంవత్సరంతో పోలిస్తే ఇప్పుడు కుటుంబ పొదుపు భారీగా పతనమై.. ఆ స్థానంలో కన్స్యూమర్ రుణాలు పెరుగుతున్నాయని పేర్కొంది. 2000 సంవత్సరంలో మొత్తం దేశీయ పొదుపు విలువలో కుటుంబ పొదుపు వాటా 84 శాతంగా ఉంటే.. అది 2022%-%23 సంవత్సరానికి 61 శాతానికి పడిపోయిందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దేశీయ కుటుంబ పొదుపు విలువ రూ.49 లక్షల కోట్లుగా ఉన్నట్టు అంచనా. వడ్డీ రేట్లు తగ్గిపోవడం, నవతరానికి సులభంగా రుణాలు అందించే సంస్థలు అందుబాటులోకి రావడంతో పొదుపు రేటు పడిపోవడానికి ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. 2000 సంవత్సరంలో దేశ జీడీపీలో 10.1 శాతంగా ఉండే కుటుంబ పొదుపు విలువ ఇప్పుడు 5 శాతానికి పడిపోయింది. ఇదే సమయంలో జీడీపీలో కుటుంబ రుణాల విలువ 2 శాతం నుంచి 5.8 శాతానికి పెరిగిపోయిందని బ్లూమే రీసెర్చ్ వెల్లడించింది. ప్రస్తుత తరం ఏదైనా ఒక వస్తువు నచ్చితే జేబులో డబ్బులు లేకపోయినా కొనేస్తోంది. నాన్ బ్యాయికింగ్ ఫైనాన్స్ కంపెనీలు, లోన్ యాప్స్ విరివిగా రుణాలు - మిగతా3లో



## 9,000 హార్స్‌పవర్ రైలు ఇంజిన్ సిద్ధం

- రైల్వే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిది
- దేశంలోని చాలామంది రైళ్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.
- తాజాగా భారతీయ రైల్వే అత్యంత శక్తివంతమైన ఇంజిన్‌ను రూపొందించింది
- ఈ ఇంజిన్ వచ్చే నెలలో ట్రాక్‌లపై పరుగులు తీయనున్నదని సమాచారం.

# మహిళలకు చేయూత

## 1.02 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు

- లబ్ధిదారులకు ప్రత్యేక శిక్షణ
- మహిళల కోసం రూ.255 కోట్లు కేటాయించిన సీఎం చంద్రబాబు కు కృతజ్ఞతలు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**ప్రజాజ్యోతి అమరావతి**

మహిళలకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ తెలిపింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆర్థిక మేలు కలిగేలా నిర్ణయం తీసుకుంది. టైలరింగ్ లో మహిళలకు శిక్షణ అందజేసి, వారికి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేయనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడుతూ, ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో టైలరింగ్ లో శిక్షణ అందజేసి, ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించడంపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. సమాజాభివృద్ధిలో మహిళలే కీలకమని గుర్తించిన టీడీపీ ప్రభుత్వాలు...వారి సాధికారితకు, ఆత్మగౌరవానికి, - మిగతా3లో



## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రఘురామ కృష్ణరాజు కేసు, అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడంపై చర్యలు



## రైతులకు శుభవార్త..

- రైతులకు శాశ్వత విద్యుత్ కనెక్షన్‌ను కేవలం రూ.5 మాత్రమే
- మధ్యప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఈ పథకాన్ని త్వరలో అమలు
- మధ్యప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం రైతులను ప్రోత్సహించడం. వారి జీవితాలను మెరుగుపరచడం
- విద్యుత్ సమస్యలు లేకుండా, సాగునీటి అవసరాలను తీర్చేందుకు సౌర (సోలార్) పంప్‌లను ఏర్పాటు

## 28.62 లక్షల శాశ్వత కుల ధ్రువీకరణ

# పత్రాల అందజేత

**ప్రజాజ్యోతి అమరావతి**

మరో ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ఇప్పటి వరకు 28 లక్షల 62 వేల కుటుంబా లకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశామని వెల్లడించారు. సుమోటోగా రెవెన్యూ అధికారులే 34 లక్షల 37 వేల కుటుంబాల డేటాను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. వీఆర్వోలు ఇంటింటికెళ్లి శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు అందజేశారు. స్కూళ్లు, కాలేజీల్లో ప్రవేశాలకు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలుకు, ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకునేందుకు కులధ్రువీకరణ పత్రాలు ఉపయోగపడతాయి ఇక ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ కులధ్రువీకరణ పత్రాల కోసం తిరగాల్సిన అవసరం లేదు. సమోటోగా విచారణ జరిపి దాదాపు ఐదు లక్షల కుటుంబాలకు వివిధ కారణాల రీత్యా కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వలేదు. వీరిలో ఎవరైనా అర్హులు ఉన్నారని అనుకుంటే గ్రామ, వార్డు సచివాలయాల - మిగతా3లో



# నిర్మానుష్యంగా మహాకుంభమేళ ప్రాంతం

**లక్నో :** ప్రయాగ్ రాజ్‌లో దాదాపు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళ యాత్రికులతో కిక్కిరిసిపోయింది. 144 ఏళ్లకు ఒక్కసారి వచ్చే ఆ మహా కుంభమేళలో అమృత స్నానాన్ని చేసేందుకు దేశ విదేశాల నుంచి యాత్రికులు ప్రయాగ్ రాజ్‌కు పోటెత్తారు. జనవరి 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు సాగిన ఈ మహా కుంభమేళ.. జనసంద్రంగా మారింది. ఈ కుంభమేళ ఇటీవల ముగియడంతో.. ప్రయాగ్ రాజ్ పరిసర ప్రాంతాలన్నీ నిర్మానుష్యంగా మారాయి.

ఇక ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమం ప్రాంతంతోపాటు పరిసర ప్రాంతాలను 15 రోజుల్లో శుభ్రం చేసేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. దీనిని ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభించింది. అందులోభాగంగా యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లను తీసి వేస్తున్నారు. అలాగే సంగ మం ఘాట్లు, రహదారులను శుభ్రం చేస్తున్నారు. ఇక యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మౌలిక సదుపాయాలను సైతం తొలగిస్తున్నారు. అదీకాక.. 45 రోజుల పాటు యాత్రికులతో జనసంద్రంగా మారిన ఆ ప్రాంతం ప్రస్తుతం అతి కొద్ది మంది యాత్రికులతో ఉంది.



### ఆయన ఆధ్వర్యంలో..

ఇక ఈ ప్రాంతంలో పరిశుభ్ర పరిచే కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారి ఆకాంక్ష రానా పర్యవేక్షిస్తున్నారు. స్వచ్ఛతా మిత్రా, గంగా సేవా దూత్‌లో ఈ ప్రాంతాన్ని శుభ్రపరుస్తున్నారు. అలాగే ఈ ప్రాంతంలోని వ్యర్థాలను నైనీలోని నిర్వీర్యం చేసేందకు బస్వార్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. మరోవైపు ఈ మహాకుంభమేళలో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు.. పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు 15 వేల పారిశుద్ధ్య పనివారితోపాటు 2 వేల గంగా సేవా దూత్‌లను ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

### గిన్నిస్ రికార్డులు..

దీంతో మహాకుంభమేళ జరిగినన్ని రోజులు.. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచారు. ఇక 45 రోజుల పాటు సాగిన ఈ మహాకుంభమేళలో రోజుకు 1.5 కోట్ల మంది భక్తులు ఈ సంగమంలో స్నానం చేశారు. ఇది మూడు గిన్నిస్ ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. అదే విధంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతోపాటు ఆయన కేబినెట్ మంత్రులు, వివిధ రంగాల ప్రముఖులు సైతం ఈ మహాకుంభమేళకు హాజరయ్యారు. విదేశీ ప్రముఖులు సైతం ప్రయాగ్ రాజ్ విచ్చేశారు.



### తప్పలేదు తొక్కిసలాట..

జనవరి 29వ తేదీ మౌని అమావాస్య. ఈ రోజు మహాకుంభమేళలో తొక్కిసలాట జరిగింది. ఇందులో 30 మంది మరణించారు. మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఈ మహాకుంభమేళలో పలుమార్లు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అందులో పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. ఇక యాత్రికుల రద్దీతో దాదాపు 300 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏదీ ఏమైనా.. దాదాపు 144 ఏళ్లకు ఒక్కసారి మాత్రమే వచ్చే ఈ మహాకుంభమేళ.. రికార్డు సృష్టించింది.

## 9,000 హార్స్‌పవర్ రైలు ఇంజన్ సిద్ధం



**న్యూఢిల్లీ:** భారతీయ రైల్వే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని అంటారు. దేశంలోని చాలామంది రైళ్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అటు ప్రయాణికులను, ఇటు వస్తువులను తరలించేందుకు రైళ్లు రవాణా రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. రైల్వేలు ఒకవైపు ఆధునికత దిశగా పరిగెడుతూ, మరోవైపు ప్రయాణికులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నాయి. తాజాగా భారతీయ రైల్వే అత్యంత శక్తివంతమైన ఇంజిన్‌ను రూపొందించింది. ఈ ఇంజిన్ వచ్చే నెలలో ట్రాక్‌లపై పరుగులు తీయనున్నదని సమాచారం. ఈ అత్యంత శక్తివంతమైన ఇంజిన్‌ను గుజరాత్‌లోని దాహెూద్ ఫ్యాక్టరీలో తయారు చేశారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా ఈ ఇంజిన్ తయారు చేసిన ఫ్యాక్టరీని సందర్శించారు. ఇక్కడ గూడ్స్ రైలు ఇంజన్లు తయారు చేస్తుంటారు. ప్రస్తుతం మొదటి అత్యంత శక్తివంతమైన ఇంజిన్ సిద్ధం అయ్యింది. ఈ రైల్వే కర్మాగారాన్ని 'మేక్ ఇన్ ఇండియా' ధ్యేయంలో భాగంగా ఏర్పాటు చేశారు. ఈ కర్మాగారానికి 2022లో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. కేవలం మూడేళ్లలో ఈ కర్మాగారం దేశంలోనే అత్యంత శక్తివంతమైన రైలు ఇంజిన్‌ను నిర్మించి, ట్రాక్‌పైకి తీసుకువచ్చింది. భారతీయ రైల్వే ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లను 6000 హార్స్‌పవర్ నుండి 9000 హార్స్‌పవర్‌కు అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇంజినీరింగ్ కంపెనీ సీమెన్స్ గుజరాత్‌లోని దాహెూద్‌లో రూ.20,000 కోట్ల ఖరీదు చేసే 9,000 హార్స్ పవర్ కలిగిన 1,200 ఎలక్ట్రిక్ ఇంజిన్‌లను తయారు చేయనుంది. 9000 హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన ఈ ఇంజిన్ 4,500 టన్నుల సరుకును మోసుకెళ్లే గూడ్స్ రైలును అధిక వేగంతో నడుపుతుంది. ఒక సాధారణ ట్రక్కు 7 నుండి 10 టన్నుల వస్తువులను మాత్రమే తీసుకువెళుతుంది. ఈ నూతన ఇంజిన్లతో రైళ్ల వేగం గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల మేరకు పెరగనుంది.

## 'ప్రజలు యాచించే అలవాటును పెంచుకున్నారు'.. బీజేపీ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

**భోపాల్:** కేంద్ర మాజీ మంత్రి, మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి ప్రహ్లాద్ పటేల్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రజలు యాచించే అలవాటు పెంచుకున్నారని అన్నారు. ప్రజా సమస్యల వినతులను 'భిక్షాటన'గా ఆయన అభివర్ణించారు. శనివారం రాజ్‌గఢ్ జిల్లాలో వీరాంగన రాణి అవంతిబాయి లోధి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రహ్లాద్ పటేల్ పాల్గొన్నారు. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి మంత్రి అయిన ఆయన ఈ సందర్భంగా సభలో ప్రసంగించారు. 'ప్రభుత్వం నుంచి భిక్షాటన చేసే అలవాటును ప్రజలు పెంచుకున్నారు. నాయకులు వచ్చినప్పుడు పిటిషన్లతో నిండిన బుట్టను అందజేస్తారు. వారికి వేదికపై దండలు వేస్తారు. వారి చేతుల్లో లేఖలు ఉంచుతారు. ఇది మంచి అలవాటు కాదు. అడగడానికి బదులుగా, ఇచ్చే మనస్తత్వాన్ని పెంపొందించుకోండి. ఇది సంతోషకరమైన జీవితానికి దారితీస్తుంది. సంస్కారవంతమైన సమాజాన్ని నిర్మించడంలో సహాయపడుతుందని నేను మీకు హామీ ఇస్తున్నా' అని అన్నారు. కాగా, ప్రజలు ఉచితాలపై అధికంగా ఆధారపడటం సమాజాన్ని బలోపేతం చేయడానికి బదులుగా బలహీనపరుస్తుందని మంత్రి ప్రహ్లాద్ పటేల్ అన్నారు. 'ఈ యాచకుల సైన్యం సమాజాన్ని బలోపేతం చేయడం లేదు. అది బలహీనపరుస్తుంది. ఉచిత వస్తువుల పట్ల ఆకర్షణ ధైర్యవంతులైన మహిళల గౌరవానికి చిహ్నం కాదు. మనం వారి విలువలకు అనుగుణంగా జీవించినప్పుడు అమరవీరుడిని నిజంగా గౌరవిస్తారు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు ఎప్పుడైనా భిక్షాటన చేసిన అమరవీరుడి పేరు చెప్పగలరా? అని ప్రహ్లాద్ పటేల్ అడిగారు. అలా అయితే తనకు చెప్పాలని అన్నారు. 'నర్మద పరిక్రమ యాత్రికుడిగా నేను భిక్ష అడుగుతా. కానీ నా కోసం ఎప్పుడూ అడగను. ప్రహ్లాద్ పటేల్‌కు ఏమీ ఇచ్చారని ఎవరూ చెప్పరు' అని అన్నారు. కాగా, బీజేపీ మంత్రి ప్రహ్లాద్ పటేల్ చేసిన ఈ వ్యాఖ్యలపై ఎంపీ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతు పట్వారీ స్పందించారు. ఆయన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. 'బీజేపీ అహంకారం ఎంత స్థాయికి చేరిందంటే వారు ప్రజలను బిచ్చగాళ్ళు అని పిలుస్తున్నారు. ఎన్నికలకు ముందు తప్పుడు వాగ్దానాలు చేసి, వాటిని నెరవేర్చడానికి నిరాకరిస్తారు. ప్రజలు వాటిని గుర్తుచేసినప్పుడు సిగ్గు లేకుండా బిచ్చగాళ్ళు అని పిలుస్తారు. వారు గుర్తించుకోవాలి. త్వరలో ఈ బీజేపీ నాయకులు ఓట్లు అడుక్కోవడం కోసం వస్తారు' అని మండిపడ్డారు.



## రైతులకు శుభవార్త..



రైతులకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులకు శాశ్వత విద్యుత్ కనెక్షన్‌ను కేవలం రూ.5 మాత్రమే అందిస్తున్నట్లు ఆ రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. మధ్యప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఈ పథకాన్ని త్వరలో అమలు చేయనుంది. ఈ సందర్భంగా సీఎం మోహన్ యాదవ్ మాట్లాడుతూ... మధ్యప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం రైతులను ప్రోత్సహించడం. వారి జీవితాలను మెరుగుపరచడం. విద్యుత్ సమస్యలు లేకుండా, సాగునీటి అవసరాలను తీర్చేందుకు సౌర (సోలార్) పంప్‌లను ఏర్పాటు చేయబోతున్నాం. వచ్చే మూడు సంవత్సరాల్లో 30 లక్షల సోలార్ పంప్‌లను రైతులకు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. రైతుల నుండి సౌర విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయబోతుంది. తద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశముంది. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో సరైన రోడ్లు, విద్యుత్, మౌలిక సదుపాయాలు లేకుండా ఇబ్బంది పడ్డాం. కానీ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది' అని వ్యాఖ్యానించారు.

## నడ్డా వారసుడి కోసం రంగం సిద్ధం

**న్యూఢిల్లీ :** వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారం సాధించి, దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీకి నెక్ట్స్ బాస్ ఎవరనే ప్రశ్న ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. జేపీ నడ్డా తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎవరు వస్తారని ఆ పార్టీతో పాటు దేశ రాజకీయ వర్గాలన్ని ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 15 లోపు బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. బీజేపీ అధ్యక్షుడి ఎన్నికకు, 50 శాతం రాష్ట్రాలలో సంస్థాగత ఎన్నికలు తప్పనిసరి. దానికి ముందు, బూత్, మండల్, జిల్లా స్థాయిలకు ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతం 36 రాష్ట్రాలలో 12 రాష్ట్రాలలో మాత్రమే ఎన్నికలు పూర్తయ్యాయి. కాబట్టి కనీసం ఆరు రాష్ట్రాలలో యూనిట్ చీఫ్‌ల ఎన్నికలు అవసరం.వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాంచ, గుజరాత్ రాష్ట్రాలలో బీజేపీ ఈ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఎటువంటి మార్పు ఉండదు. అత్యున్నత పదవికి ప్రతిపాదిత పేర్లను సమర్పించాలని రాష్ట్ర ఇన్‌చార్జ్‌లను ఇప్పటికే పార్టీ అధిష్టానం కోరింది. ప్రస్తుతానికైతే ఏ ఒక్కరి పేరు కూడా బీజేపీ జాతీయ అధ్యక్షుడి రేసులో వినిపించడం లేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమించబడాలంటే.. కచ్చితంగా ఆ వ్యక్తికి ఆర్ఎస్ఎస్ ఆమోదం ఉండాల్సిందే. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం గురించి తెలిసి, ఆ సిద్ధాంతాన్ని నమ్మి, పాటించే వ్యక్తికే బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి దక్కనుంది.2019లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జేపీ నడ్డా పార్టీ బాధ్యతలను స్వీకరించారు. జనవరి 2020లో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన కంటే ముందు ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన నుంచి నడ్డా ఆ బాధ్యతలు స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా నడ్డా పదవీకాలాన్ని జూన్ 2024 వరకు పొడిగించారు. ఆ తర్వాత ఆయన ప్రభుత్వంలోకి ప్రవేశించడంతో, పార్టీ ఆయన తర్వాత ఎన్నికయ్యే అభ్యర్థుల కోసం చూస్తోంది. కానీ ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. పార్టీలోని అగ్రనేతలు ఈ అంశంపై ఏకాభిప్రాయం సాధించాలని ఆశిస్తున్నారు. మరి చూడాలి ఎంతో పవర్ ఫుల్ పొజిషన్‌గా భావిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎవరు వస్తారో. బీజేపీ జాతీయ అధ్యక్ష రేసులో పలువురి పేర్లు ఉన్నాయి. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, పార్టీ జనరల్ సెకెటరీ సునీల్ బన్సల్, అగ్రనేతలు ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ యాదవ్, వినోద్ తావ్డే వంటి ప్రముఖులు ఉన్నారు.

## మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌కు మాయావతి షాక్

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి ఆదివారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆమె రాజకీయ వారసుడిగా భావిస్తున్న మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను మరోసారి అన్ని పార్టీ పదవుల నుంచి తొలగించారు. ఆకాష్ తండ్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్‌ను కొత్త జాతీయ సమన్వయకర్తలుగా నియమించారు. ఆదివారం లక్నోలో జరిగిన బీఎస్పీ సమావేశంలో ఈ మేరకు పార్టీలో భారీ మార్పులు చేశారు. కాగా, బీఎస్పీ సంస్థాగత బలాన్ని బలహీనపరిచే వర్గాలను సృష్టించడం ద్వారా పార్టీలో విభజనకు అశోక్ సిద్ధార్థ్ కారణమయ్యారని మాయావతి ఆరోపించారు. పార్టీకి లేదా ఉద్యమానికి హాని కలిగించడానికి తన పేరును దుర్వినియోగం చేస్తే వారిని వెంటనే తొలగిస్తానని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు ఈ సూత్రానికి అనుగుణంగా అశోక్ సిద్ధార్థ్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు మాయావతి తెలిపారు. ఆయన ప్రభావం ఉన్న అల్లుడు ఆకాష్ ఆనంద్‌ను కూడా పార్టీ బాధ్యతలన్నింటి నుంచి తొలగించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని బహుజనుల పురోగతికి మాత్రమే కాకుండా దేశ పురోగతికి ఈ మార్పు అవసరమని అన్నారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి వేడుకల ప్రణాళికలను కూడా మాయావతి వెల్లడించారు.

POST OFFER ADVERTISEMENT TO THE EQUITY SHAREHOLDERS OF

**MIZZEN VENTURES LIMITED**

(Formerly known as Jyothi Infraventures Limited)
("MVL"/ "TARGET COMPANY" / "TC")
(Corporate Identification No. L70200TG1995PLC019867)
Registered Office: Flat No 704, D Block Tower A, Aparna heights, Kondapur Main Road, Laxmi Nagar, Kondapur, K. V. Rangareddy, Serilingampally, Telangana, India, 500084;
Phone No.: +91- 8639410322; Email id: cs@jyothiinfra.com; Website: www.jyothiinfra.com

Open offer for acquisition of 57,21,300 Equity Shares of Rs. 10/- each representing 26.01% of the expanded equity and voting share capital of the Target Company by Mr. Sandeep Dsilva ("Acquirer-1"), Mr. Anil Anand Khot ("Acquirer-2"), Mr. Nimesh Sahadeo Singh ("Acquirer-3"), Mr. Chetan Mehrotra ("Acquirer-4"), Mr. Rajiv Jaisukhlal Vaghani ("Acquirer-5") and Mr. Hiren Kishor Deshpande ("Acquirer-6") (Acquirer-1, Acquirer-2, Acquirer-3, Acquirer-4, Acquirer-5 and Acquirer-6 hereinafter collectively referred to as the "Acquirers").

This Post offer Advertisement is being issued by Navigant Corporate Advisors Limited, The Manager to the offer, on behalf of the Acquirers, in connection with the offer made by the Acquirers in compliance with regulation 18 (12) of the Securities and Exchange Board of India (Substantial Acquisition of Shares and Takeovers) Regulation, 2011 and subsequent amendments thereto **("SEBI (SAST) Regulation, 2011")**.

The Detailed Public Statement **("DPS")** pursuant to the Public Announcement **("PA")** made by the Acquirers have appeared in Financial Express - English Daily (all editions); Jansatta - Hindi Daily (all editions); Pratahkaal - Marathi Daily (Mumbai edition); Prajajyothi - Telugu Daily – (Rangareddy -Telangana edition) on 23rd August, 2024.

1. Name of the Target Company : Mizzen Ventures Limited
2. Name of the Acquirers : Mr. Sandeep Dsilva ("Acquirer-1"), Mr. Anil Anand Khot ("Acquirer-2"), Mr. Nimesh Sahadeo Singh ("Acquirer-3"), Mr. Chetan Mehrotra ("Acquirer-4"), Mr. Rajiv Jaisukhlal Vaghani ("Acquirer-5") and Mr. Hiren Kishor Deshpande ("Acquirer-6")
3. Name of the Manager to the offer : Navigant Corporate Advisors Limited
4. Name of the Register to the officer : Adroit Corporate Services Private Limited
5. Offer details
   a) Date of Opening of the Offer : Friday, 07th February, 2025
   b) Date of the Closing of the offer : Friday, 21st February, 2025
6. Date of Payment of Consideration : N.A. since no shares tendered in the Open Offer
7. Details of the Acquisition :

| Sr No. | Particulars | Proposed in the Offer Document | | Actual | |
|---|---|---|---|---|---|
| 7.1. | Offer Price | Rs. 10 per Equity Share | | Rs. 10 per Equity Share | |
| 7.2. | Aggregate number of Shares tendered | 57,21,300 | | Nil | |
| 7.3. | Aggregate number of Shares accepted | 57,21,300 | | Nil | |
| 7.4. | Size of the offer (Numbers of shares multiplied by Offer price per share) | Rs. 572.13 Lacs | | Nil | |
| 7.5. | Shareholding of the Acquirers before Share Purchase Agreement (SPA) and Public Announcement (No. & %) | Nil (0.00%) | | Nil (0.00%) | |
| 7.6. | Shares Acquired by way of Share Purchase Agreement (SPA) and Preferential Allotment ▪ Number ▪ % Fully Diluted Equity Share Capital | 1,43,00,029 (65.01%)* | | 1,43,00,029 (65.01%)* | |
| 7.7. | Shares Acquired by way of Open offer ▪ Number ▪ % Fully Diluted Equity Share Capital | 57,21,300 (26.01%)* | | 0 (0.00%) | |
| 7.8. | Shares Acquired after detailed Public Statement ▪ Number of Shares acquired ▪ Price of the shares acquired ▪ % of the shares acquired | Not Applicable | | Not Applicable | |
| 7.9. | Post offer Shareholding of Acquirers ▪ Number ▪ % Fully Diluted Equity Share Capital | 2,00,21,329 (91.03%)* | | 1,43,00,029 (65.01%)* | |
| 7.10. | Pre and Post Offer Shareholding of Public Shareholders | Pre- Offer | Post Offer | Pre- Offer | Post offer |
| | ▪ Number ▪ % Fully Diluted Equity Share Capital | 3,94,803 (25.51%)$ | 19,73,671 (8.97%)* | 3,94,803 (25.51%)$ | 76,94,971 (34.99%)* |

*$Computed as a %age of pre preferential equity and voting share capital of MVL which was 1,54,78,830 consisting of 15,47,883 equity shares of face value of Rs. 10 each.*

**Computed as a %age of Expanded Equity & Voting Share Capital which consists of 2,19,95,000 fully paid -up equity shares of the face value of Rs. 10/- each of the Target Company being the capital post allotment of 1,96,37,117 equity shares and also inclusive of 8,10,000 warrants convertible into equity shares to other on preferential basis.*

***Note:** The Board of Directors of the Target Company at their meeting held on August 16, 2024, has authorized a preferential allotment of 1,96,47,117 equity shares (1,31,46,949 equity shares to Acquirers and 65,00,168 equity shares to public category investors) and 8,10,000 Warrants convertible to Equity Shares. Accordingly, offer to public shareholders was given of 26.00% of Expanded Equity and Voting Share Capital. However, Target Company on October 04, 2024 has allotted 1,96,37,117 equity shares (1,31,46,949 equity shares to Acquirers and 64,90,168 equity shares to public category investors) and 8,10,000 Warrants convertible to Equity Shares. Accordingly, expanded Equity and Voting Share Capital has been revised to 2,19,95,000 equity shares on fully diluted basis and offer of 57,21,300 given to public shareholders stands of 26.01% of Expanded Equity and Voting Share Capital.*

8. The Acquirers accepts full responsibility for the information contained in this Post Offer Advertisement and also for the fulfillment of his obligations as laid down by SEBI (SAST) Regulations, 2011.
9. A copy of this Post Offer Advertisement will be available on the website of SEBI.
10. Capitalized terms used in this advertisement and not define herein, shall have same meaning assigned to them in the Letter of Offer dated 25.01.2025.

**ISSUED BY MANAGER TO THE OFFER FOR AND ON BEHALF OF THE ACQUIRERS**

Navigant Reinventing Business
**NAVIGANT CORPORATE ADVISORS LIMITED**
804, Meadows, Sahar Plaza Complex, J B Nagar, Andheri Kurla Road, Andheri East, Mumbai - 400059.
**Tel No.** +91 22 4120 4837 / 4973 5078
**Email id:** navigant@navigantcorp.com
**Website:** www.navigantcorp.com
**SEBI Registration No:** INM000012243
**Contact person**: Mr. Sarthak Vijlani

**Place : Mumbai**
**Date : February 28, 2025**

# మహిళలకు చేయూత

-మొదటిపేజీ తరువాయి

సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యమిస్తున్నాయి. నాడు అన్న ఎన్టీఆర్ ఆస్తిలో మహిళలకు సమాన హక్కులు కల్పించడంతో పాటు రాజ్యాధికారంలోనూ భాగస్వాములను చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు కూడా అన్నింటా మహిళలకు ప్రథమ ప్రాధాన్యమిస్తున్నారు. ఇళ్ల పట్టాలను మహిళల పేరునే మంజూరు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు కూడా వారి పేరు మీదనే చేపడుతున్నారు. విద్య, ఉద్యోగావకాశాల్లో మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదే. మహిళల అభ్యున్నతికి వెన్నంటి ఉంటూ భరోసా కల్పిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు వారికి ఆర్థికాభ్యున్నతి కల్పించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా స్వయం ఉపాధి పథకాల్లోనూ మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇంటి పట్టున ఉండే మహిళలకు ఆర్థిక భరోసా కలిగేలా టైలరింగ్ లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. కేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి కుట్టుమిషన్లను కూడా ఉచితంగా అందజేయనున్నారు. ఈ నెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లబ్ధిదారులకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కేంద్రాలు ప్రారంభంకానున్నాయి.

**1,02,832 మహిళా లబ్ధిదారుల ఎంపిక**

రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజక వర్గాల్లోనూ బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గానికి చెందిన 1,02,832 మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేయాలని సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.255 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా 46,044 మందికి, ఈడబ్లూఎస్ సామాజిక వర్గానికి చెందిన 45,772 మందికి, కాపు కార్పొరేషన్ ద్వారా అదే సామాజిక వర్గానికి



చెందిన 11,016 మందిని ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం చివరి దశకు చేరుకుంది.

**90 రోజుల పాటు శిక్షణ...ఉచితంగా కుట్టు మిషన్లు**

మహిళలకు భవిష్యత్తుపై భరోసా లభించేలా టైలరింగ్ లో శిక్షణ ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. 90 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుంది. తూతూ మంత్రంగా కాకుండా టైలరింగ్ లో నిష్ణాతులైన వారితో మహిళలకు శిక్షణివ్వనున్నారు. నేటి అభిరుచులకు అనుగుణంగా దుస్తుల తయారీలో ఈ శిక్షణ కొనసాగనుంది. శిక్షణ అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేయనున్నారు. శిక్షణ ద్వారా ప్రావీణ్యం పొందిన మహిళలు సొంతంగా ఆదాయ ఆర్జిస్తూ, తమ కుటుంబాలకు తద్వారా సమాజానికి ఆసరాగా నిలవ్వాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయం.

**మహిళల ఆర్థిక స్వేచ్ఛకు మరెన్నో పథకాలు**

సంపద సృష్టిలో మహిళలను భాగస్వాములను చేసేందుకు చంద్రన్న ప్రభుత్వం వారిని వివిధ వృత్తులను ప్రోత్సహిస్తోంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేవలం టైలరింగ్ శిక్షణతోనే సరిపెట్టకుండా ఈవెంట్ మేనేజ్ మెంట్ నిర్వహణ యూనిట్ల ఏర్పాటులోనూ మహిళలకే ప్రాధాన్యమిస్తున్నారు. వాటితో పాటు బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా అమలు చేసే స్వయం ఉపాధి పథకాల అమలులోనూ మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు. డెయిరీ, గొర్రెల వంటి యూనిట్లతో పాటు జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటులోనూ ముందుకొచ్చిన మహిళా లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

**చంద్రన్న పాలనలో మహిళా సంక్షేమం: మంత్రి సవిత**

సమాజాభివృద్ధిలో మహిళల పాత్రే కీలకమని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చిల్లర దుకాణాలు, కుట్టు శిక్షణ, అగరబత్తీలు, పామాయిల్ తదితర చిన్నపాటి వ్యాపారాల వైపు నడిపిస్తూనే... ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి బొమ్మలు, మంగళగిరి, ధర్మవరం చీరలు, పూతరేకులు, చెక్క బొమ్మలు, పిల్లల ఆట బొమ్మల తయారీలో భాగస్వాములను చేస్తోందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,02,832 మహిళలకు టైలరింగ్ శిక్షణ అందజేసి, కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సీఎం చంద్రబాబు నాయుడు లక్షసాధనలో భాగంగా తమవంతు సంపద సృష్టిలో భాగస్వాములు కావాలని మంత్రి సవిత కోరారు.

# పాపం.. పోసాని నోరు ఎత్తని సినీ ప్రముఖులు

**విజయవాడ :** దక్షిణాదిన రాజకీయాలు సినిమాలు ఒకటిగా కలిసిపోయి చాలా దశాబ్దాలే దాటింది. సినిమాల నుండి వచ్చిన ఎంజీఆర్ ఎన్టీఆర్ జయలలిత పవన్ కళ్యాణ్ వంటి వారు ఉన్నత పదవులు అధిరోహించారు. ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రులైన వాళ్ళు అయితే చాలామందే ఉన్నారు. జనాల్లో సినిమా వాళ్ళకు ఉండే క్రేజ్ వాళ్ళ ఫ్యాన్ ఫాలోయింగ్ రాజకీయంగా తమకు ఉపయోగపడుతుందని పార్టీలు సినీ రంగంతో వీలైనంత దగ్గరగా ఉండే ప్రయత్నం చేస్తాయి. కాంగ్రెస్ బిజెపి లాంటి జాతీయ పార్టీల నుండి ప్రాంతీయ పార్టీల వరకు ఎవరు దీనికి అతీతులు కాదు. అయితే ఈ విషయంలో వైసిపి పూర్తిగా వెనకబడిందనే చెప్పాలి. వైసిపి మద్దతుదారుడుగా ఉన్న పోసాని కృష్ణ మురళి అరెస్టు అయితే కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా టాలీవుడ్ నుంచి స్పందించలేదు. నిన్న మొన్నటి వరకు అధికారం లో పార్టీకి ఇలాంటి దుస్థితి ఏర్పడడం వెనక స్వయంకృతాపరాధాలే ఉన్న ఎక్కువ ఉన్నాయనే చర్చ నడుస్తుంది. ముఖ్యంగా టాలీవుడ్ కోణం లో వైసిపి ఒంటరి అయిపోయిందన్న వాదన బలపడుతోంది స్వయంగా సినిమా నుండి వచ్చిన ఎన్టీఆర్ పెట్టిన పార్టీ కావడం టాలీవుడ్ తో ఆద్యంతం మంచి రిలేషన్ మెయింటైన్ చేయడం టిడిపికి స్వతహాగా కలిసివచ్చే బలాలు. సామాజిక వర్గం పరంగా టిడిపి అప్రోచ్ పరంగా టాలీవుడ్ లో టిడిపి కి సానుభూతిపరులు చాలామంది ఉన్నారు. ఎంత ఎలా అంటే 2019 ఎన్నికల తర్వాత పూర్తిగా కుదలైపోయింది టిడిపి అనే ప్రచారం జరుగుతున్న సమయంలోనూ కొంతమంది టాలీవుడ్ పెద్దలు స్టార్లు టిడిపి వెంటే ఉన్నారు. అశ్విని దత్ మురళీమోహన్ లాంటి బడా ప్రొడ్యూసర్లు స్వయంగా టిడిపి పార్టీ సభ్యులు. రాఘవేంద్రరావు, బోయపాటి లాంటి వాళ్ళు అయితే టిడిపి కోసం పని చేసిన చరిత్ర కలిగిన వాళ్లు. జగన్ ప్రభుత్వం చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు చాలామంది ఆయనకు మద్దతుగా మాట్లాడిన వాళ్లే ఉన్నారు. ఎన్టీఆర్ తనయుడు టాలీవుడ్ టాప్ స్టార్ లలో ఒకరైన నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం టిడిపి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు టాలీవుడ్ లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న మెగా ఫ్యామిలీ నుండి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. చిరంజీవి మొదలుకొని మొత్తం మెగా ఫ్యామిలీ లో హీరోలు అందరూ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కు నైతిక మద్దతు



ఇస్తున్నారు. పవన్ పిలిస్తే జనసేన వైపు రావడానికి టాలీవుడ్ లో కొంతమంది రెడీగా ఉన్నట్టు ఇంటర్వ్యూలో చెబుతూ ఉంటారు. టాలీవుడ్ నిర్మాత పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు ప్రస్తుతం జనసేనలో చాలా యాక్టివ్ గా ఉన్నారు. అల్లు అర్జున్ తో ఫ్యామిలీకి విభేదాలు ఉన్నాయంటూ ప్రచారం జరుగుతున్న బహిరంగంగా రెండు కుటుంబాల హీరోలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న సంఘటనలు ఎప్పుడు ఎదురు కాలేదు. రాజీవ్ గాంధీ రిక్వెస్ట్ రాజకీయాల్లోకి వచ్చిన సూపర్ స్టార్ కృష్ణ అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్కు బలమైన సపోర్టుగా నిలిచారు. ఇప్పటికీ పాతకాలం ఆర్టిస్టుల్లో కాంగ్రెస్ సానుభూతిపరులు ఉన్నారు. వైయస్సార్ బతికున్నప్పుడు జయసుధ ప్రజారాజ్యం విలీనమైన తర్వాత చిరంజీవి కాంగ్రెస్ లోనే కొంతకాలం కొనసాగారు. బిజెపిలోనూ సినిమా స్టార్లు బాగానే ఉన్నారు. అయితే ఈ సంఖ్య నార్తులో ఎక్కువ. తెలుగు రాజకీయాల్లోనూ గతంలో కోట శ్రీనివాసరావు లాంటివాళ్లు బిజెపి తరపున ఎమ్మెల్యేలు కూడా అయ్యారు. ప్రస్తుత ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధ్రీశ్వరి సైతం సినీ కుటుంబం నుంచి వచ్చినవారే. డైరెక్ట్ గా బీజేపీలో చేరకపోయినా సైదాంతిక పరంగా ఆ పార్టీకి మద్దతు ఇచ్చే సినీ ప్రముఖులు సినీ రంగంలో బాగానే ఉన్నారు.మొదటినుంచి వైసిపి సినీ ప్రముఖులనాకట్టుకోవడంలో విఫలం అవుతూనే వచ్చింది. రాజశేఖర్ జీవిత లాంటి వాళ్ళు మొదట్లో వైసీపీలో చేరినా చాలా తొందరగానే బయటికి వచ్చేసారు. అక్కడి వ్యవహారాలు తమకు సూట్ కావని బహిరంగంగానే ప్రకటన ఇచ్చారు. 2019 ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన మంచు మోహన్ బాబు కూడా కొద్ది కాలానికి దూరం అయిపోయారు. ఇక సినిమా ఇండస్ట్రీ పై జగన్ ప్రభుత్వం అధికారం చెలాయించాలని చూసిందనే విమర్శలు టాలీవుడ్ నుంచి వినబడతాయి. చిరంజీవి, ప్రభాస్, మహేష్ బాబు లాంటి టాప్ స్టార్లను తన ఇంటి ముందు నడిపించి అవమానించారని ఒక వర్గం ఆరోపిస్తూ ఉంటుంది. సినీ నటుడు పృథ్వి కి ఎస్వీబీసీ చైర్మన్గా పదవి ఇచ్చినా ఆయన ఆరోపణలు ఎదుర్కొని బయటకు వచ్చేసారు. తనపై వైసీపీలో కుట్ర జరిగిందనేది ఆయన వెర్షన్. ప్రస్తుతం జనసేనలో ఆయన కొనసాగుతున్నారు. ఎన్నికల ముందు వైసీపీలో చేరిన ఆలీ 2024 ఫలితాలు తర్వాత జగన్ కి బై బై చెప్పేశారు. పార్టీలో చేరకపోయినా మద్దతు దారుడు గా కొనసాగిన పోసాని కూడా ప్రత్యక్ష రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్టు ఎన్నికల తర్వాత ప్రకటించారు. అప్పట్లో పవన్ కళ్యాణ్ చంద్రబాబు లోకేషన్ లపై తీవ్రమైన పదజాలంతో ఆయన చేసిన ఆరోపణలు ఇప్పుడు ఆయన అరెస్టు అయ్యేలా చేశాయి. కానీ విచిత్రంగా టాలీవుడ్ నుంచి ఆయనకు మద్దతుగా ఒక్కరంటే ఒక్కరు కూడా బయటకు వచ్చి మాట్లాడింది లేదు. పోసాని మాట ఎలా ఉన్నా అసలు వైసీపీ పార్టీనే టాలీవుడ్ నుంచి మద్దతు కోల్పోయిందనేది విశ్లేషకులు చెబుతున్న మాట. జగన్ ఫోటో తోటే ఎన్నికల్లో గెలుస్తాం తప్ప వేరే ఎట్రాక్షన్ స్టార్ పవర్ అవసరం లేదంటూ గతంలో వైసీపీ కీలక నేతలు చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీని టాలీవుడ్కు దూరం చేశాయని సినీ రంగ ప్రముఖులు చెబుతూ ఉంటారు. ప్రస్తుతం యాంకర్ శ్యామల లాంటి ఒకరిద్దరు మాత్రం వైసీపీతో ఉన్నా ముందు వరుసలో ఉండే స్టార్లెవరూ వైసిపి లో లేరు. నందమూరి, మెగా ఫ్యామిలీ లకు సొంత పార్టీలు ఉన్నాయనుకున్నా ప్రభాస్ మహేష్ బాబు లాంటి టాప్ స్టార్లైతే రాజకీయాల వాసనే దగ్గరకు రానివ్వరు. స్టార్ల విషయం పక్కన పెట్టి ఇతర ప్రముఖులు వైసిపి వైపు రావడానికి అక్కడి ఉన్న పరిస్థితులు అడ్డుపడుతున్నాయి అన్నది అంతర్గత సమాచారం. సినిమా వాళ్ళతో కలిసి ముందుకు వెళ్లడానికి అనువుగా ఉండాల్సిన సమన్వయం వైసీపీలో లేదనేది ఎక్కువగా వినబడుతున్న మాట. మరి వైసీపీ పెద్దలు ఈ విషయాన్ని పట్టించుకుంటారు లేదో చూడాలి.

# కోనసీమ మోనాలిసా

**కాకినాడ :** మహా కుంభమేళా మొత్తానికి సోషల్ మీడియా వేదికగా సెంట్రాఫ్ అట్రాక్షన్ ఏమైనా ఉందంటే అది పూసలమ్ముకునే మోనాలిసానే... మధ్యప్రదేశ్కు చెందిన ఓ అమ్మాయి ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో పూసలు అమ్ముకుంటుండగా ఆమె కళ్లకు, ఆమె అందానికి ఫిదా అయిన ఓ వ్యక్తి ఆమె వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు... ఇక ఆ వీడియో ఎవ్వరూ ఊహించలేనంతగా వైరల్ అయ్యి దేశవ్యాప్తంగా ట్రెండ్ అయ్యింది. అంతే కాదు భాషతో సంబంధం లేకుండా మోనాలీసా వీడియోలు సోషల్ మీడియా వేదికలపై చక్కర్లు కొట్టాయి. దీంతో మెయిన్ స్ట్రీమ్ మీడియా నుంచి యూట్యూబ్ ఛానెళ్లు సైతం మోనాలీసా ఇంటర్వ్యూ కోసం ఎగబడ్డారు. వీరే కాదు సాధారణ జనం కూడా ఆమెతో ఫోటోలు దిగేందుకు ఆమెను పోలీసులు దాచాల్సిన పరిస్థితి ఏర్పడిరది.ఆమె చివరకు ట్రైన్ ఎక్కి తమ సొంతూరుకు వెళ్లాల్సి వచ్చింది.. ఆ తరువాత ఆమెను బాలివుడ్ దర్శక నిర్మాత కలిసి చివరకు సినిమాలోకూడా తీసుకున్నారు.. అయితే అలాగే అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓ తీర్థమహోత్సవంలో పూసలు అమ్ముకుంటున్న ఓ బాలికను వీడియో తీసి కోనసీమ మోనాలిసా అంటూ పోస్ట్ చేశాడో యువకుడు.. అయితే ఇప్పుడు ఆయువకుడు కేసుల్లో ఇరుక్కోవాల్సిన పరిస్థితి తలెత్తింది.కోనసీమ ప్రాంతంలో కాట్రేనికోన మండలం చెయ్యేరులో సత్తెమ్మతల్లి తీర్థమహోత్సవం మూడు రోజుల పాటు ఘనంగా జరిగింది. ఈ తీర్థమహోత్సవంలో ముమ్మిడివరానికి చెందిన ఓ బాలిక తల్లితండ్రులకు బాసటగా ఉండేందుకు పూసల దండలు, ఇతర అలంకరణ వస్తువులు అమ్ముతుండగా ముమ్మిడివరంకు చెందిన దుర్గాప్రసాద్ అనే యువకుడు కోనసీమ మోనాలీసా అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో పోస్ట్ చేశాడు. అది బాగా వైరల్ అయ్యింది.. దీంతో కేవలం ఇన్‌స్టాలోనే కాకుండా సోషల్‌మీడియా ఇతర వేదికల్లోనూ ఈ వీడియో గిర్రున తిరగడంతో ఈ అమ్మాయిని గుర్తుపట్టిన వారు ఆమెను ఆటపట్టించడం మొదలు పెట్టారు.ఈ బాలిక ఓ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతుండడంతో తోటి విద్యార్థులు కూడా ఆటపట్టించడం మొదలుపెట్టారు.. దీంతో ఆ అమ్మాయి వాళ్ల అమ్మకు చెప్పడంతో కుటుంబీకుల సలహాతో ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది.. పోలీసుల దర్యాప్తులో ముమ్మిడివరానికి చెందిన దుర్గాప్రసాద్ అనే యువకుడు ఈ వీడియో తీసి ఇన్‌స్టాలో పోస్ట్ చేసినట్లు గుర్తించారు పోలీసులు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 28.62 లక్షల శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాల అందజేత

-మొదటిపేజీ తరువాయి

ద్వారా, ఏపీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వెంటనే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అక్కడక్కడే కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారనీ తెలిపారు.

## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ సస్పెన్షన్

**అమరావతి**

ఏపీ సీఐడీ మాజీ చీఫ్, ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆయనను సస్పెండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడంతో పాటు మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును వేధించిన కేసులో ఆయనపై అభియోగాలు ఉన్నాయి. 2020 నుంచి 2024 మధ్య ప్రభుత్వ అనుమతి లేకుండా పలుమార్లు విదేశాలకు వెళ్లి ఆలిండియా సర్వీసు నిబంధనలను సునీల్‌కుమార్ ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గతంలోల రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా నేతృత్వంలో విచారణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## పొదుపులో కుదుపు..

-మొదటిపేజీ తరువాయి

ఇస్తుండటంతో ప్రస్తుత తరం వాళ్లు ఖర్చుకు వెనకాడటం లేదు. 2015%-%16లో మొత్తం రుణాల్లో కన్స్యూమర్ రుణాల వాటా 21 శాతంగా ఉంటే.. 2023%-%24 నాటికి 34 శాతానికి చేరిపోయింది. దీనికి విరుద్ధంగా పారిశ్రామిక రుణాలు 42 శాతం నుంచి 34 శాతానికి పడిపోయాయి. భారతీయులు చేస్తున్న అప్పుల్లో అత్యధికంగా గృహ రుణాలు కాకుండా ఇతర రుణాలు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం పొదుపు%-%ఋఅప్పుల నిష్పత్తి చూస్తే కొంత ఆందోళన కలిగిస్తోందని, దీర్ఘకాలంలో దేశ సుస్థిర ఆర్థిక వ్యవస్థపై ఇది ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని బ్లూమే రీసెర్చ్ నివేదిక పేర్కొంది.

## వచ్చే ఫస్ట్ నుంచి పురుష పొదుపు సంఘాలు

**ఏలూరు :** మహిళా సంక్షేమం కోసం తెలంగాణ, ఏపీతో పాటు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రారంభించింది. వారికి స్వయం ఉపాధి కల్పించడంతో పాటు.. ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో పొదుపు సంఘాలకు రుణాలను మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళలకు డ్వాక్రా గ్రూపులు ఉన్నట్లుగానే ఏపీలో పురుష కార్మికులకు కూడా పొదుపు సంఘాలు ఏర్పాటు కానున్నాయి. వీరికి కూడా రుణాలను మంజూరు చేయనున్నారు.1982లో ప్రారంభించిన డ్వాక్రా పథకం గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో తోడ్పాటును అందిస్తోంది. ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే కాకుండా.. స్వయం ఉపాధి అవకాశాలను ఈ పథకం కల్పిస్తుంది. ఈ పథకంలో మహిళలకు చాలా తక్కువ వడ్డీతో రుణాలను మంజూరు చేస్తారు.దీని మాదిరిగానే పట్టణాల్లో అసంఘటిత రంగంలో పనిచేసే పురుషుల కోసం స్వయం శక్తి బృందాలు ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం రుణాలను అందించనుంది. దీనిలో భాగంగానే పురుషుల కోసం ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది.దేశవ్యాప్తంగా ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ కింద 2,841 గ్రూపులను ఏర్పాటు చేసినట్లు మెప్మా అధికారులు పేర్కొన్నారు. ఔజఒఓ (నేషనల్ అర్బన్ లైవ్‌లీవుడ్ మిషన్) 2.0 కొత్త గైడ్‌లైన్స్ ప్రకారం.. మహిళలు ఎలాగైతే స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పడి రుణాలు పొందుతున్నారో.. అలానే పురుషులకు కూడా రుణాలను అందించేందుకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ఈ పథకం రూపొందించినట్లు మెప్మా అధికారులు తెలిపారు.డ్వాక్రా సంఘంలోని మహిళలు గ్రూపుగా ఏర్పడిన విధంగా.. పురుషులు కూడా కనీసం 5 మందితో గ్రూప్ ఏర్పాటు చేసుకోవచ్చు. గరిష్టంగా ఎంత మందైనా ఈ గ్రూపులో చేరవచ్చు. ఇలా ఒక గ్రూపుగా ఏర్పడిన వారికి మాత్రమే బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తాయి. దీనిని వాయిదాల రూపంలో బ్యాంకులకు తిరిగి చెల్లించవచ్చు. ప్రతి ఒక్కరూ కనీసం రూ.100 పొదుపు చేయాల్సి ఉంటుంది.ఉదాహరణకు ఐదుగురు సభ్యులున్న గ్రూపులో రూ.500 పొదుపుతో మూడు నెలల పాటు క్రమం తప్పకుండా పొదుపు చేస్తే, రివాల్వింగ్ ఫండ్ కింద రూ. 25 వేలు మంజూరు చేస్తారు. వీటిని ఆరు నెలల పాటు క్రమంతో తప్పకుండా పొదుపు చేస్తే, ఫస్ట్ లింకేజీ కింద బ్యాంకులు ఆరు రెట్లు రుణం అందిస్తాయి. రుణాలు అందుకున్న పురుషులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీని మాఫీ చేస్తాయి.వీటికి భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులతో పాటు.. రిక్షా కూలీలు, తోపుడు బండ్లు నడిపే వారు, గిగ్ వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, కేర్ వర్కర్స్ అర్హులుగా ఉంటారు.

## 25 లక్షల ఇన్సూరెన్స్...

**గుంటూరు :** రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యమే ప్రధానంగా ఏపీ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రస్తుత బడ్జెట్ 2025లో ప్రజా సంక్షేమానికే పెద్ద పీట వేసింది. రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి కొండంత అండగా నిలుస్తోంది. ఏపీ ప్రజల కోసం సరికొత్త ఇన్సూరెన్స్ స్కీమ్ తీసుకొస్తోంది. నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు ఈ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు వార్షిక బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. రాష్ట్రంలో ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల బీమా సౌకర్యాన్ని తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాదు.. ఈ ఆరోగ్య బీమా పథకం ఈ ఏడాది నుంచి అమలులోకి రానుందని వెల్లడించారు. ఇందుకోసం ఆరోగ్యశాఖకు రూ.19,264 కోట్లను బడ్జెట్లో కేటాయించారు.మధ్యతరగతి, పేద ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా కార్పోరేట్ వైద్యం అందేలా హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలు చేయనున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో ఆయన పేర్కొన్నారు. రూ. 25 లక్షలతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమాను అందించనున్నట్టు తెలిపారు.ఎన్టీఆర్ వైద్య సేవను కొనసాగిస్తూనే.. ఆరోగ్య బీమా పథకం అమలు చేయనున్నట్టు మంత్రి పయ్యావుల స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉండగా.. అంతకన్నా మెరుగైనా వైద్య సేవలను అందించనుందా? అనేది తెలియాల్సి ఉంది. ఈ కొత్త ఇన్సూరెన్స్ స్కీమ్ అమలుకు సంబంధించి నియమ నిబంధనలపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దాంతో ఎవరెవరు ఇందుకు అర్హులు అనేది స్పష్టత లేదు.ప్రస్తుత రోజుల్లో ఆస్పత్రుల ఖర్చులు భారంగా మారిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ఇన్సూరెన్స్ సామాన్య, మధ్యతరగతి వారిలో వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించనుంది. మెరుగైన ఇన్సూరెన్స్ కవరేజ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అత్యంత ప్రయోజనకరంగా ఉంటుందని నిలుస్తుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే దీనికి సంబంధించి కొత్త నిబంధనలు విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు

## నేను కేంద్ర మంత్రి అయ్యాక చంద్రబాబు ఓ సూచన చేశారు.... దాని ప్రకారమే నడుచుకుంటున్నా: రామ్మోహన్ నాయుడు

**హైదరాబాద్ కవాడిగూడలో కిషన్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రెస్ మీట్**

**రెండు తెలుగు రాష్ట్రాల కోసం పనిచేయాలని చంద్రబాబు సూచించారని వెల్లడి**

**వరంగల్ ఎయిర్ పోర్టు క్లియరెన్స్ తన హయాంలో జరగడం సంతోషదాయకమని వివరణ**

**ఒకప్పుడు వరంగల్ ఎయిర్ పోర్టు ఆసియాలోనే అతి పెద్దదని స్పష్టీకరణ**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నేడు హైదరాబాద్ లోని కవాడిగూడలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... తాను కేంద్ర మంత్రి అయ్యాక చంద్రబాబు ఓ సూచన చేశారని... నువ్వు కేవలం ఆంధ్రప్రదేశ్ కోసం మాత్రమే పనిచేయకుండా, రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం పనిచేయాలి అని గైడెన్స్ ఇచ్చారని వెల్లడించారు.

## సంపాదకీయం

# చట్టసభలకూ పరిమితులు!

నిబద్ధత, సచ్ఛీలత, నిబంధనలపట్ల సంపూర్ణ అవగాహన కలిగినవారి సారథ్యంలో చట్టసభలుంటే అలాంటిచోట ఆరోగ్యవంతమైన చర్చలు జరుగుతాయి. ప్రజాస్వామ్యానికి ఆ సభ తలమానికమవు తుంది. కానీ అధికార పక్షానికి వంతపాడేవారు, వారి ఇష్టారాజ్యానికి పక్కతాళం వేసేవారు అధ్యక్ష స్థానాల్లో కూర్చుంటున్నారు. తాము ఎవరికీ జవాబుదారీ కాదన్నట్టు ప్రవర్తిస్తున్నారు. అలాంటి బాపతు నేతలకు ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు. తనను బిహార్ శాసనమండలి నుంచి బహిష్కరించటాన్ని సవాలుచేస్తూ ఆర్జేడీ సభ్యుడు సునీల్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను అంగీకరిస్తూ ఆయన్ను తక్షణం సభలోకి అనుమతించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సభ్యుల అనుచిత ప్రవర్తనకు తగిన శిక్ష ఉండాలితప్ప మితిమీరకూడదని తేల్చిచెప్పింది. నిరుడు మార్చిలో గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలోనూ, ఆ తర్వాత ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంలోనూ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై సునీల్ కుమార్ సింగ్ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారన్నది అభియోగం. పాము కుబుసం విడిచినట్టు తరచు రాజకీయ అభిప్రాయాలు మార్చుకోవటం నితీశ్‌కు అలవాటని, ఇప్పటికి తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రి అయినా ఎమ్మెల్యేగా ప్రజలనుంచి ఎన్నిక కాలేదని సునీల్‌కుమార్ సింగ్ విమర్శించారు. అధికారమే పరమావధిగా ఒకసారి యూపీఏ, మరోసారి ఎన్డీయే కూటములతో చెలిమి చేయటాన్ని ఎద్దేవా చేస్తూ ఆయన్ను 'పాల్తూరామ్' అని హేళన చేశారు. దీంతో ఈ వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి నివేదించారు. సునీల్ తప్పు చేశారని ఎథిక్స్ కమిటీ నిర్ధారించి సభా బహిష్కారానికి సిఫార్సుచేసింది. శాసనమండలి దీన్ని ఆమోదించి ఆయన్ను బహిష్కరిస్తూ తీర్మానించింది. మన రాజ్యాంగం కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల విభజన చేసింది. చట్టసభలకు ప్రత్యేక హక్కులుంటాయని, వాటి కార్యకలాపాల్లో లేదా నిర్ణయాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోరాదని సభాధ్యక్షులు భావిస్తుంటారు. ముఖ్యంగా ఫిరాయింపులపై వచ్చే ఫిర్యాదుల్ని ఎటూ తేల్చకుండా వదిలేస్తూ తమను ప్రశ్నించరాదంటున్నారు. చిన్న చిన్న కారణాలకు కూడా విపక్ష ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయటం, బహిష్కరణ వేటు వేయటం వంటివి రివాజయ్యాయి. కేవలం పాలకపక్ష ప్రయోజనాలను నెరవేర్చటం కోసమే స్పీకర్లు ఇలా ఇష్టాను సారం ప్రవర్తిస్తున్నారు. నిజమే... రాజ్యాంగంలోని 212(1) అధికరణ ప్రకారం చట్టసభల కార్యకలా పాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణతో ఆ కార్యకలాపాల చెల్లుబాటును న్యాయ స్థానాల్లో సవాలు చేయటానికి వీల్లేదు. నిర్వహణ సంబంధమైన అంశాల్లో న్యాయస్థానాల జోక్యంనుంచి చట్టసభలకు ఇది రక్షణనిస్తుంది. అయితే ఆ కార్యకలాపాల్లో భాగంగా తీసుకునే నిర్ణయాల్లో రాజ్యాంగ విరుద్ధత కనబడినప్పుడు వాటిని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందన్నది నిపుణుల వాదన. తాజా కేసులో జరిగింది ఇదే. సునీల్ కుమార్ సింగ్ పిటిషన్‌కు అసలు విచార ణార్హత లేదని, 212(1) అధికరణ న్యాయవ్యవస్థ జోక్యాన్నుంచి తమకు రక్షణనిస్తున్నదని శాసన మండలి తరఫు న్యాయవాది వాదించారు. సర్వోన్నత న్యాయస్థానం దీన్ని అంగీకరించలేదు. చట్ట సభల కార్యకలాపాలు వేరు, అందులో తీసుకునే నిర్ణయాలు వేరు అని స్పష్టం చేసింది. చట్టసభల నిర్ణయాలు వ్యక్తుల ప్రాథమిక హక్కుల్ని ప్రభావితం చేసినప్పుడు వాటిని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందని తెలిపింది. అంతేకాదు... సునీల్‌కుమార్ సింగ్‌ను బహిష్కరిస్తూ తీసు కున్న ఎథిక్స్ కమిటీ నిర్ణయం పాలనాపరమైన చర్యే తప్ప శాసనవ్యవస్థ కార్యకలాపంగా పరిగణించలేమని తేల్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కూడిన చట్టసభ నియంత పోకడలు పోకూడదు. మెజారిటీ ఉందన్న సాకుతో విపక్ష సభ్యుల గొంతు నొక్కడానికీ, వారిపై కఠిన చర్యలకు ఉపక్రమించటానికీ ప్రయత్నించకూడదు. ఆ పరిస్థితులు తలెత్తితే న్యాయస్థానాలుమౌనంగా ఊరుకోబోవని తాజా తీర్పు తేటతెల్లం చేసింది. చట్టసభ కార్యకలాపాలు సాఫీగా సాగటానికి అనువైన నిబంధనలు రూపొందించుకొనేందుకు రాజ్యాంగంలోని 208వ అధికరణ అధికారమిస్తోంది. సభ క్రమశిక్షణగా నడవటానికి ఎలాంటి నిబంధనలుండాలో, వాటిని ఉల్లంఘించినప్పుడు ఏయే చర్యలు తీసుకోవాలో ఈ నిబంధనలు నిర్దే శిస్తాయి. అయితే నిబంధనల అమలు పర్యవేక్షణకు ఏర్పడిన కమిటీలు తీసుకునే నిర్ణయాలు పాలనాసంబంధ పరిధిలోకి వస్తాయని గుర్తించటం తప్పనిసరని తాజా తీర్పు చెబుతోంది. ఆ నిర్ణయాలకు మెజారిటీ ఆమోదం ఉందా లేదా అనే అంశంతో దీనికి సంబంధం లేదు. ఒక చర్యకు ప్రతిగా తీసుకునే ఏ నిర్ణయమైనా హేతుబద్ధతకూ, తార్కికతకూ లోబడివుండటం అవసరం. పిచ్చు కపై బ్రహ్మాస్త్రం తరహాలో అధికారం ఉంది కదా అని ఏమైనా చేస్తామంటే ప్రజాస్వామ్యంలో చెల్లదు. చట్టసభలు ఇష్టానుసారం వ్యవహరించే రోజులు పోయాయి. సభానిర్వహణ సవ్యంగా జర గటం, క్రమశిక్షణ కట్టుతప్పకుండా చూడటం అవసరమే. కానీ అందుకోసం అమలుచేసే చర్యలు అతిగా ఉండకూడదు. సభ్యులు పరిధి మీరారని భావించినప్పుడు అభిశంసించడం, మందలించడం, నిర్దిష్ట కాలానికి సభనుంచి సస్పెండ్ చేయడంవంటి అవకాశాలున్నాయి. కానీ విచక్షణ మరిచి నేరుగా బహిష్కరణ వేటు వేయటం అతిగా వ్యవహరించటమే అవుతుంది. ఎథిక్స్ కమిటీల నిర్ణ యాలు పాలనానిర్వహణ కిందికే వస్తాయని, వాటిపై న్యాయసమీక్ష తప్పదని సుప్రీంకోర్టు నిర్ణయించటం హర్షించదగ్గది. నియంతృత్వ పోకడలు పోయే పాలకపక్షాలకు ఈ తీర్పు చెంపపెట్టు.

# సమాంతర ప్రత్యామ్నాయమే గెలుపు దారి!





భూస్వామ్యం, పెట్టుబడిదారీ వ్యవస్థలు కలగలసి అధికారం పాలుపంచుకుంటున్న వర్గ సమాజంలో సంపన్న వర్గాల సాహిత్య భాషా సంస్కృతులు ప్రధాన స్రవంతిగా అమలవుతా యి. ప్రజల సాహిత్యం, కళలు ప్రత్యామ్నాయ లేదా సమాంతర పాయగా పిలువబడతాయి. దీనినే 'సమాంతర ప్రత్యామ్నాయం' అందాం. ఆధునిక కాలంలో సినిమా, నాటకం, నవల, వచన కవిత, ఫోటోగ్రఫీ, చిత్రకళ ప్రధాన స్రవంతిగా ప్రచారం పొందుతున్నాయి. సినిమాల్లో ఉన్నత శిష్ట చరిత్రలో భాగంగా పౌరాణికాన్ని ఇతివృత్తంగా గ్రహిస్తారు. ప్రత్యామ్నాయ రంగం నుండి కొన్ని పాటలను, కొందరు ప్రజావీరుల చరిత్రలను కేవలం లాభాల కోసం మాత్రమే తీసుకుంటారు. ప్రత్యామ్నాయ రంగంలో వినపడే, కనపడే భాష సినిమాల్లో విలన్లకు, జోకర్లకు మాత్రమే వాడబడుతుంది. ప్రాచీన కాలంలో వివిధ పోరాటాలలో అమరులైన ప్రజావీరుల చరిత్ర అనామకం అయిపోతుంది. ఆ ప్రజావీరులపై ప్రజలు పాడుకునే సాహిత్యం గిరిజనమై, జానపదమై అంటరాకుండా మూలల్లోకి తోసివేయబడుతుంది. ఈ దేశంలో వేలాది కులాలు, వారి దైవాలు, దేవతలు, కొలుపుల వంటివి అవమానింపబడతాయి. ఈ ధోరణిని ఆధునిక/ ప్రగతిశీల వ్యక్తులు, వేదికలు సైతం నిరాఘటంగా కొనసాగిస్తాయి. కొన్ని వేదికలు తమకు అర్థమైన, తమ పాత్ర ఉన్న రచనలకు, తమ వారిగా ముద్ర వేసుకున్న రచయితలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తాయి. ఈ కారణం చేతనే ఈ రచనలు ప్రధాన స్రవంతిలోకి వచ్చి నిలుస్తాయి తప్ప వాటి రచనా శక్తిని బట్టి కాదు. ఈ నేపథ్యంలో ఆయా కుల వర్గాల నుండి వచ్చిన చాలామంది రచయితలు తమ గురించి తాము, తమ వర్గాల గురించి తాము అనివార్యంగా రాసుకున్నారు. ఈ సజీవ ఇతివృత్తాలు తెలుగు సాహిత్యానికి పెట్టని సొమ్ములయ్యాయి. ఆధునిక సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. ఈ సాహిత్యం లేకపోతే, ఈ రచయితలు రాయకపోతే తెలుగు సాహిత్యం పక్షవాతంతో చచ్చుపడిన శరీరంలా ఉండేది. వివిధ భాషలలోకి తర్జుమా చేయవలసిన గొప్ప రచనలు ప్రత్యామ్నాయ సాహిత్యంలో అనేకం వున్నాయి. ఈ సాహిత్యానికి కౌంటర్‌గా శిష్ట రచయితలు భావోద్వేగ ఆరాటాలను, జ్ఞాపకాలను గ్లామరైజ్ చేస్తూ తాము ఇలాగే రాస్తున్నామనే భ్రమల్లో ఉన్నారు. కాని వాస్తవికంగా, చీమునెత్తురోడే ప్రత్యామ్నాయ సాహిత్యంతో అవి పోటీపడవు. ప్రత్యామ్నాయ రంగాన్ని ప్రజలు ప్రేమిస్తారు. కాని ప్రధాన స్రవంతి నిరాకరిస్తుంది. ఇంతవరకు గుర్తింపబడని మనుషులు, సమూహాలు, బృందాలు... అనేక సామాజిక కోణాలు వాస్తవికతలు ఒక్కొక్కటి వెలుగులోకి రావాల్సిందే. సామాజిక సాంస్కృతిక పోరాటాలు, వాటి శక్తి యుక్తులు మట్టి చేతుల్లో దివిటీల్కై వెలగాల్సిందే. ఆ గాయాల హస్తాలు సమస్త రంగాలలో మార్పు కోసం ఎజెండా లిఖించాల్సిందే. అనాదిగా కొనసాగుతున్న ఈ ప్రక్రియ మరింత అర్థవంతంగా కొనసాగాల్సి ఉంది. వర్తమాన ప్రజల చరిత్రలను గుర్తించని, పఠించని యాంత్రిక నినాదప్రాయ వర్ణింపులు దండగ. వీరికన్నా శ్రమ బతుకుల్ని సాహిత్య సెర్చ్‌లైట్లుగా మార్చేవారే అవసరం. వీళ్ళు గతం నుండి నేర్చుకుంటారు. వర్తమానంలో చెమట చుక్కల్నీ, గాయాల సలుపుల్నీ గుర్తిస్తారు. ఏ మార్పులేని గత కీర్తనల వల్ల సాధించేది తక్కువ. ఈ పరిస్థితి మారాలి. ప్రత్యామ్నాయ ఆలోచనలు వికసించాలి. అనేక పూలు పూయాలి, భావజీవ వైవిధ్యత పెరగాలి. బ్యాండుమేళం నొక్కులు యాంత్రిక శబ్దాన్నే పాడతాయి. వెయ్యేళ్ల సాహిత్యంలో అధిక శాతం అలాంటిదే. ప్రత్యామ్నాయ సాహిత్య ధార బహుళత్వానికి, భిన్నత్వానికి, కొత్తచూపుకి, కూర్పుకి, ఖాళీల పూరింపుకి, కొత్త రచనా రీతికి, వ్యక్తీకరణల కి బాటలు వేస్తుంది. ఇక్కడ సాధారణ ప్రజలలోంచి వచ్చినవారు రచయితలు, కవులు, గాయకులు అవుతారు. వీరి నాయకత్వంలో కొత్త సాహిత్యభాష ఊపందుకొంటుంది. శిష్ట సాహిత్య కళారంగాలకు ప్రాణవాయువులు అందిస్తుంది. కొత్త పాఠకవర్గాన్ని తయారు చేసుకుంటుంది. ప్రధాన స్రవంతికి సవాలుగా నిలుస్తుంది. కాబట్టి బలీయ సాహిత్య సాంస్కృతిక వ్యవస్థ దీనిని వీల్కైనంత పక్కన పెడుతుంది. ఐతే ఈ మధ్య ప్రత్యామ్నాయ రచయితలు గతంలో లాగా రచనలు చేసి ఊరుకోవడం లేదు. తమ గురించి తాము పట్టించుకుంటు న్నారు. అజ్ఞాత అనామక కులవర్గాల నుండి ఈ రచయితలు సొంత శక్తితో, సృజనాత్మక బలంతో ప్రతిభా సంపన్నతలతో తమని విస్మరించలేని పరిస్థితి కల్పిస్తున్నారు. నాయకత్వాలకు, ఆధిపత్యాలకు పరిమితమైన శిష్ట రచయితలు విఫలమైన చోట ఈ రచయితలు తమ అస్తిత్వాలకు లిఖిత మౌఖిక సాహిత్య కళా రంగంలో చలన శీల స్థానం కల్పించడంలో విజయం సాధిస్తున్నారు. ఈ సాహిత్యాన్ని కొందరు అభ్యుదయ మేధావులు కొన్ని పేర్లు పెట్టి ప్రత్యర్థి సాహిత్యంగా భావిస్తున్నారు. శిష్టులు ఒక విధంగా ప్రజల సాహిత్య కళా సంస్కృతులను పరాయీకరిస్తే, ఈ అభ్యుదయవాదులు మరోవిధంగా పరాయీకరిస్తున్నారు. ప్రత్యామ్నాయ రచయితలు ఈ ఉచ్చుల్లో పడవద్దు. ప్రధాన స్రవంతి పన్నాగాలలో చిక్కుపడిపోవద్దు. తమతమ వ్యక్తిత్వాలను, అస్తిత్వాలను కాపాడుకోవాలి.

# పునర్విభజన పేచీ తేల్చేదెలా?




ఎప్పటినుంచో చర్చకొస్తున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అంశంపై ఎట్టకేలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నోరువిప్పారు. ఈ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోదని హామీ ఇచ్చారు. దీనిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కూడా అన్నారు. ఏ విషయమైనా వివాదాస్పదమైనప్పుడు వెంటనే వివరణనిచ్చి సందేహాలను తొలగించటం ప్రభుత్వాల బాధ్యత. 2023 సెప్టెంబర్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా డీఎంకే నాయకురాలు కనిమొళి దీన్ని ప్రస్తావించారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన ప్రక్రియ అమలు చేస్తే దక్షిణాదికి, ముఖ్యంగా తమిళనాడుకు అన్యాయం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆ సమస్యే తలెత్తదని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఇప్పుడు అమిత్ షా అయినా, గతంలో మోదీ అయినా అన్యాయం జరగబోదని వాగ్దానం చేస్తున్నారు. మంచిదే. మరైతే పునర్వి భజన ఎలా ఉండబోతోంది? ఏ ప్రాతిపదికన చేస్తారు? అది చెప్పనంత కాలమూ ఈ సంశయాలు సమసిపోవు. జనాభా ప్రాతిపదికనే తీసుకుంటే అన్యాయం జరుగుతుందన్నది దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న సందేహం. అందుకు ఇతరత్రా ప్రాతిపదికలు తీసుకోబోతున్నామని తేటతెల్లం చేసినప్పుడే అందరికీ స్పష్టత వస్తుంది. దక్షిణాదితో పోలిస్తే ఉత్తరాది రాష్ట్రాలు చాలా అంశాల్లో సాపేక్షంగా వెనకబడి వున్నాయి. విద్య, వైద్యం, ఆర్థికం వగైరాల్లో దక్షిణాదిదే ముందంజ. ఇదంతా జనాభాను అదుపు చేయటం వల్లనే సాధ్యమైంది. 2011 జనాభా లెక్కల ప్రకారం బిహార్‌లో జనాభా పెరుగుదల రేటు 25 శాతంగావుంటే, కేరళలో అది 5 శాతం మాత్రమే. ఎన్నికలు జరిగినప్పుడల్లా బీజేపీ 'డబుల్ ఇంజన్ సర్కారు'ను తెరపైకి తెస్తుంది. ఆ సంగతెలా వున్నా దేశానికి 'గ్రోత్ ఇంజన్' దక్షిణాది అని చెప్పవచ్చు. అందుకే పునర్విభజనపై ఉన్న సందేహాలను పారదోలటం అవసరం. జనాభా లెక్కల సేకరణ జరిగి గణాంకాలు వెల్లడైనప్పుడల్లా ఆ ప్రాతిపదికన నియోజకవర్గాల హద్దులు, చట్టసభల్లో స్థానాల సంఖ్య మార్చాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. దానికి అనుగుణంగా 1951, 1961, 1971 సంవత్సరాల జనాభా లెక్కల ప్రాతిపదికన లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల అసెంబ్లీల్లోని స్థానాల సంఖ్య మారుతూ వచ్చింది. నియోజకవర్గాల పరిధులు కూడా మారాయి. కానీ 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దీనికి బ్రేక్ వేశారు. ఆత్యయిక స్థితి కొనసాగుతున్న వేళ 42వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చి 2001 వరకూ పునర్విభజన ప్రక్రియను స్తంభింపజేశారు.

అధిక జనాభా ఉన్న రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి జనాభా పెరుగుదలను అరికడితే ఏ రాష్ట్రమూ స్థానాల సంఖ్యను కోల్పోకుండా ఉంటుందని ఆమె ప్రభుత్వం భావించింది. కానీ ఎప్పటిలా దక్షిణాది రాష్ట్రాలే జనాభా అదుపులో ముందున్నాయి. 2001లో తప్పనిసరై పునర్విభజన ప్రక్రియ మొదలెట్టినా అది కేవలం నియోజకవర్గాల పరిధుల్లో మార్పులకే పరిమితమైంది. స్థానాల సంఖ్య యథాతథంగా ఉండిపోయింది. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనను దృష్టిలో ఉంచుకునే ఆ పనిచేశారు.

జనాభా పెరుగుదల రేటులో అసమతౌల్యం చాలా సమస్యలకు దారితీస్తోంది. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లో ఒక ఎంపీ సగటున 30 లక్షలమంది జనాభాకు ప్రాతినిధ్యం వహించాల్సి వుంటుంది. అదే తమిళనాడులో అయితే దాదాపు 18 లక్షలమంది జనాభాకు ప్రతినిధిగా ఉంటారు. అంటే పునర్విభజన ప్రక్రియ ప్రాతిపదిక అన్ని అంశాల్లోనూ సమతుల్యతను సాధించాల్సి వుంటుంది. 1977 నాటి లోక్‌సభలో ప్రతి ఎంపీ సగటున 10.11 లక్షల జనాభాకు ప్రాతినిధ్యంవహించారు. అయితే అన్ని నియోజకవర్గాలూ ఈ చట్రంలో ఇమిడే అవకాశం ఉండదు గనుక కాస్త అటూ ఇటూగా నిర్ణయించారు. జనాభా లెక్కల సేకరణలో ఇప్పటికే మనం నాలుగేళ్లు వెనకబడి వున్నాం. కానీ కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ అంచనా ప్రకారం ప్రస్తుత జనాభా దాదాపు 143 కోట్లు. ఈ జనాభాకు 1977 నాటి ప్రాతిపదికన ఎంపీ స్థానాలు నిర్ణయించాల్సివస్తే వాటి సంఖ్య ఇంచుమించు 1,400కు చేరుతుంది. దీని ప్రకారం యూపీ స్థానాల సంఖ్య (ఉత్తరాఖండ్ కలుపు కొని) 85 నుంచి మూడురెట్లు పెరిగి 250కి చేరుతుంది. బిహార్‌కు (జార?ండ్ కలుపుకొని) ప్రస్తుతం ఉన్న 25 స్థానాలూ 82కు చేరుతాయి. తమిళనాడుకు దాదాపు రెట్టింపు సీట్లు పెరిగి 39 నుంచి 76 అవుతాయి. కేరళకు మాత్రం ప్రస్తుతం ఉన్న 20 కాస్తా 36 అవుతాయి. నియోజకవర్గానికి 20 లక్షల జనాభా ఉండాలనుకుంటే మొత్తం స్థానాలు 707 అవుతాయి. కానీ అలా జరిగితే తమిళనాడు స్థానాల సంఖ్య ఇప్పుడున్న మాదిరే ఉండిపోతుంది. కేరళ మాత్రం రెండు స్థానాలు కోల్పోతుంది. యూపీ మాత్రం 126కు చేరుతుంది. మన నూతన పార్లమెంటు భవనం 888 మంది ఎంపీలు ఆసీనులు కావటానికి వీలుగా నిర్మించారు. ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా, ఉన్న స్థానాలు కోల్పోకుండా పునర్విభజన ఉంటుందని అమిత్ షా చెప్పటం ఊరట కలిగిస్తుంది. కానీ జమ్మూ, కశ్మీర్‌లో జరిగిందేమిటి? అక్కడ అసెంబ్లీ స్థానాలు (లద్దాఖ్ మినహా) 83 నుంచి 90కి చేరు కున్నాయి. కొత్తగా పెరిగిన 7 స్థానాల్లో హిందువులు అధికంగా వున్న జమ్మూకు 6 వస్తే, ముస్లింల ప్రాబల్యంవున్న కశ్మీర్‌కు ఒక్కటి మాత్రమే పెరిగింది. అందుకే కేవలం అన్యాయం జరగదన్న హామీ మాత్రమే సరిపోదు. పునర్విభజన ప్రక్రియకు ఇక ఎంతో సమయం లేదు గనుక దానికి అనుసరించే ప్రాతిపదికలేమిటో తేటతెల్లం చేయటం అవసరం. అది చేయనంత కాలమూ సందేహాలు ఉత్పన్నమవుతూనే ఉంటాయి. వాటిని అబద్ధాలుగా కొట్టిపారేసినంత మాత్రాన సమసిపోవు.

# రెవిన్యూ అధికారులు ఇండ్ల పట్టాలపై హామీ ఇవ్వకపోతేజిల్లావ్యాప్తఉద్యమంగామలుస్తాం

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు. వి. వీరశేఖర్ హెచ్చరిక**




**బద్వేల్ మార్చి 2 (ప్రజా జ్యోతి న్యూస్)** గోపవరం మండలం పి.పి కుంట వద్ద నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని మౌలిక సౌకర్యాలు కల్పించాలని రెవిన్యూ అధికారుల కవ్వింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 9 వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. వీరశేఖర్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిలువు నీడలేని పేదలు సంవత్సరం పైబడి ఎలాంటి సౌకర్యాలు లేకపోయినా ఇక్కడ చిన్నపాటి గుడిసెలు రూములు వేసుకొని జీవనం సాగిస్తుంటే అలాంటివారికి గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిందని కనీసం ఈ ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందని ఆశించినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని ఏడు రోజులుగా ఒక పూట భోజనం చేయకుండా దీక్ష పూనుకుంటే అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని దీక్షా శిబిరాల దగ్గరికి వచ్చి హామీ ఇవ్వకపోతే ఈ దీక్షలను ఆర్డీవో కార్యాలయం దగ్గరికి మార్చి 48 గంటల దీక్షకు పునుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పి .ప్రభాకర్. మహిళా సమాఖ్య నాయకురాలు విజయమ్మ. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఖాదర్ బాషా. శాఖా కార్యదర్శి వెంకటయ్య. సహాయ కార్యదర్శి ఓబులేసు. కమిటీ సభ్యులు గురయ్య. లక్ష్మమ్మ. %ఎ%. పెంచలయ్య పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఆశాజనకంగా లేని రాష్ట్ర బడ్జెట్.

**డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని.**



**బద్వేల్ మార్చి 2 (ప్రజాజ్యోతిన్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో కడప జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యంగా యువతకు భరోసా లేదని సూపర్ సిక్స్ లో భాగమైన నిరుద్యోగ భృతి లేదని ఎన్నికల హామీలలో వాలంటీర్లకు ఇచ్చిన హామీ లేదని డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ముఖ్యంగా కడప జిల్లా ప్రజలు రాష్ట్ర బడ్జెట్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు తీరా బడ్జెట్ చూస్తే ఆశలపై నీళ్లు చల్లినట్టయిందన్నారు ముఖ్యంగా కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం దారుణమని ఒకవైపు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కడప ఉక్కు పరిశ్రమకు నిధులు ఇవ్వకుండా మరోవైపు రాష్ట్ర బడ్జెట్లో ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం జరిగేది ఎప్పుడు అని వారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు పరిశ్రమపై కపట నాటకాలు ఆడుతున్నారన్నారు అలాగే రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ లో ప్రధాన భాగమైన నిరుద్యోగ భృతి రాష్ట్రంలోని చదువుకున్న నిరుద్యోగులకు ప్రతినెల 3 వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఎన్నికలలో హామీ ఇచ్చిన ప్రభుత్వం గడచిన ఎన్ని నెలలైనా గాని ఆ హామీ నెరవేరే కార్యరూపణ దాల్చలేదన్నారు. కనీసం బడ్జెట్ సమావేశాలు అయిన నిరుద్యోగ భృతి కి నిధుల కేటాయిస్తారు అనుకుంటే వారికి పంగనామాలు పెట్టారన్నారు. అంతే కాకుండా ఎన్నికల హామీలలో రాష్ట్రంలోని వాలంటీర్లకు పదివేల రూపాయలు జీతం పెంచి వాళ్ళ ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి హామీ ఇచ్చి తీరా గడిచిన ఇన్ని నెలలైనా వాలంటీర్లను గాలిలో పెట్టారు. వీరి పైన కూడా స్పష్టత ఇవ్వలేదని అన్నారు. అంతేకాకుండా ప్రతి ఇంటికి ఒక పారాశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఒకవైపు ముఖ్యమంత్రి గారు చెబుతూనే మరోవైపు నైపుణ్య అభివృద్ధి వాటికి నిధులు కేటాయించలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీ పోస్టుల భర్తీ ఊసే లేదన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా జరుగుతున్న బడ్జెట్ సమావేశాలలో యువజన హామీ అయిన కడప ఉక్కు పరిశ్రమకు నిధుల కేటాయించాలని ఇక్కడ ప్రాంత నిరుద్యోగ నిర్మూలనకు చర్యలు చేపట్టాలని అంతేకాకుండా నిరుద్యోగ భృతి నిరుద్యోగి 3000 రూపాయలు ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని వాలంటీర్లకు ఇచ్చిన హామీని అమలు పరచాలని డివైఎఫ్ఐ గా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామన్నారు.

# బిగ్ టీవీ ఉచిత మెగా మెడికల్ క్యాంపుకు విశేష స్పందన



**280 మందికి పైగా ఉచితంగా వైద్య సేవలు**





**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** ఆమదాలవలస నియోజవర్గం పొందూరు మండల కేంద్రంలో బిగ్ టీవీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం శశిధర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపు కు విశేష స్పందన లభించింది. మండల కేంద్రంలో శ్రీ కాశీ విశ్వేశ్వర దేవాంగ యువజన సేవా సంఘం లో ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మీ , టిడిపి మండల మహిళా అద్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ , ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి లాంఛనంగా ప్రారంభించగా ఎం.డి జనరల్ మెడిసిన్ డాక్టర్ అన్నెపు శశిధర్ ,జనరల్ సర్జన్ చింతాడ గోవింద రాజులు, ఆర్థో కిషోర్ , ప్రసాద్ ,డాక్టర్ శ్రావణ్ దుర్గా (ఎం.డి ) ఈ వైద్య శిబిరంలో పాల్గొని ఉచితంగా తమ సేవలను అందించారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సుమారు 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇటువంటి మెడికల్ క్యాంపు లు నిర్వహించడం చాలా సంతోషకరమని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను చెరవేయడమే కాకుండా బిగ్ టీవీ వారు సేవా దృక్పథంతో ఇటువంటి మెడికల్ క్యాంపు లు నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఒకే రోజు రెండు తెలుగు రాష్ట్రాల్లో బిగ్ టీవీ ఆధ్వర్యంలో 100 కు పైగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం గణనీయమైన విషయమని కొనియాడారు. అనంతరం సర్పంచ్ రేగిడి లక్ష్మీ మాట్లాడుతూ వేల రూపాయల ఖర్చుతో కూడుకున్న వైద్యాన్ని నిరుపేదల చెంతకు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ మాట్లాడుతూ చిన్న ఆరోగ్య సమస్య తీవ్రంగా మారక ముందే ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలు అందించడం ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఏపీటిఎఫ్ మండల అధ్యక్షులు మొగదాల రమణ రావు మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యులతో వైద్య శిభిరం నిర్వహించి ప్రజలకు షుగర్ , బీపీ, ఈ.సి.జి తో పాటు పలు రకాల సేవలు అందించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఎంతో చేరువ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , మద్దిల శ్రీనివాస రావు ,కాలేపు శ్రీను , సత్యసాయి సేవా సమితి సభ్యులు పెన్నం నానాజీ , పాత్రికేయులు బెవర్ ఆంజనేయులు , రాయపిల్లి రాంబాబు , శ్రీకాకుళం ఆడపిల్ల సేవా సొసైటీ చైర్మెన్ ,పొందూరు సచివాలయం 1 మహిళా పోలీస్ మద్దీ లావణ్య , ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## దిమ్మగుడి హైస్కూల్ నందు చిన్ననాటి స్నేహితులను కలుస్తామన్నా ఆనందం






**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి గ్రామం నందు జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు గెట్ టుగెదర్ స్కూల్ ఫ్రెండ్స్ దిమ్మగుడి హై స్కూల్ నందు2005-2006 హై స్కూల్ బ్యాచ్.మే.4. వ తారీకు ఎక్కడున్నా అందరూ స్నేహితులు దిమ్మగుడి హై స్కూల్ నందున అందరూ గెట్ టుగెదర్ కు అందరూ కలిసి మెలిసి స్నేహితులు ఆనందంగా. ఆ చిన్ననాటి జ్ఞాపకాలను. జ్ఞాపకం చేసుకొని. ఆనందంగా ఉండాలని ఆ రోజు స్నేహితులందరూ కోరుకుంటున్నారు కనుక అందరూ ఎక్కడ ఉన్నా రావలసిందిగా కోరుచున్నాము. ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు

## కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా పగడాల నరసింహ నియామకం.



**బద్వేల్ మార్చి 2 (ప్రజాజ్యోతిన్యూస్)** బద్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పగడాల నరసింహను ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ %వూ% షర్మిల రెడ్డి గారు జారీచేసిన ఆదేశాల ప్రకారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు. %చీణ% విజయ జ్యోతి గారు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పగడాల నరసింహ మాట్లాడుతూ నాపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ బద్వేలు పట్టణ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందన్నారు. నేను గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధిగా పనిచేయడంతో నాకు ఈ పదవి కేటాయించడం జరిగిందని నాకు ఈ పదవి రావడంలో ప్రముఖ పాత్ర పోషించిన మా నాయకురాలు ప్రస్తుత కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి %చీణ% విజయ జ్యోతి గారికి, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు అచ్యుత రాజు గారికి ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి గారికి. ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బద్వేల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను కలుపుకొని పనిచేయడంతో పాటు రాబోవు మున్సిపాలిటీ ఎన్నికల్లో మా సత్తా చాటేందుకు మా వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు అచ్యుత రాజు తదితరులు పాల్గొన్నారు.

## 33 సంవత్సరల గురు పట్టాభిషేక -సాతులూరి అంతయ్య





**జీలుగుమిల్లి మార్చి నెల 2 ప్రజాజ్యోతి న్యూస్ :** జీలుగుమిల్లి మండల కేంద్రంలో, దర్భగూడెం లో పీటర్ అండ్ పౌలు విచారణ గురువులు సాతులూరి అంతయ్య అన్నారు. గురుత్వం ఎంతో పవిత్రమైనదని, సహాయ గురువులు హృదయ రాజు మాట్లాడుతూ.. విచారణ గురువులు అంతయ్య 33 సంవత్సరల గురు పట్టాభిషేక వార్షికోత్సవాన్ని దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. గురువుగా అనేక మంది విశ్వాసులకు దేవుని సువార్తను అందించారని చెప్పారు. దేవుడు ఇచ్చిన అభిషేక వరంతో అంతయ్య ఆయన సేవలో ముందుకు సాగాలన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దివ్య బలిపూజలను సమర్పించారు. విచారణ గురువు అత్తయ్య మాట్లాడుతూ.. 33 సంవత్సరాలుగా గురుత్వంలో గడపడం దేవుని ఆశీర్వాదమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్స్ వినయ, ప్రిన్సిపాల్ అమల, సిస్టర్ ఫాతిమా, సిస్టర్ ప్రేమలత, సంఘ పెద్దలు , కె.ప్రకాశం, బి. బాలస్వామి, డి. రవి డి.కన్నయ్య, మహిళలు ఉపదేశి జి.రాంబాబు, గ్రామాల ఉపదేశిలు పాల్గొన్నారు.

# వేతన జీవులను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్




**బద్వేల్ మార్చి 2 (ప్రజాజ్యోతిన్యూస్)** సిఐటియు బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 2025 -26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో వేతన జీవులను విస్మరించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో బడ్జెట్ ప్రవేశపెడుతున్నారంటే వేతనాలు పెరుగుతాయని ఎదురుచూసే వేతన జీవుల ఆశలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి అడియాశలు చేశారని, 2025 -26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ప్రసంగంలో కొన్ని పథకాల అమలు కోసం కేటాయింపులు చేస్తామన్నారు తప్ప జీతాల కోసం పనిచేస్తున్న కార్మికులకు బడ్జెట్లో చోటు ఇవ్వలేదని, ఎటువంటి జీ.వో ఇవ్వకుండానే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడి వర్కర్లకు గ్రాడ్యుటీ అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పుకోవడం సిగ్గుచేటని, ఆశ వర్కర్ల జీతాల పెంపునకు ఎటువంటి ప్రస్తావన చేయలేదని, ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు హామీ గురించి ప్రస్తావించలేదని, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామన్న హామీకి అతిగతి లేదని, గత ప్రభుత్వం దొడ్డిదారిన వాడేసుకున్న బిల్డింగ్ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ఈ బడ్జెట్లో జమ చేయలేదని, రాష్ట్రం లోని లక్షలాదిమంది కాంట్రాక్ట్ -అవుట్సోర్సింగ్ కార్మికులు తమకు మినిమం టైమ్ స్కేల్ ఉద్యోగాల పర్మినెంట్ అవుతాయని పెట్టుకున్న ఆశలపై తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లిందని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పి.ఆర్.సి, ఐఆర్ చెల్లింపు ఊసే లేదని వారికి చెల్లించాల్సిన వేలాది కోట్ల బకాయిల ప్రస్తావన, ఓ పి ఎస్ పునరుద్ధరణ వంటి విషయాలను చర్చించలేదని, ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు మరియు స్కీముల్లో లక్షల మంది పైగా పనిచేస్తున్నారని వారికి సంక్షేమ పథకాల వర్తింపు హామీ ప్రస్తావన బడ్జెట్లో లేకపోవడం శోచనీయమన్నారు. షాపింగ్ మాల్స్, ప్రైవేట్ ఆస్పత్రులు, విద్యాసంస్థలు, పెట్రోల్ బంకులు, హోటల్స్ తదితర వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న దాదాపు 50 లక్షల మంది కార్మికుల వేతనాలు 2006-2007 తర్వాత ఇంతవరకు పెంచలేదని ఈ బడ్జెట్ లో కూడా వారి వేతనాల పెంపుపై ప్రస్తావించలేదన్నారు. కార్మికుల వేతనాల కోసం సంక్షేమం కోసం తగిన విధంగా బడ్జెట్ ప్రతిపాదనలలో తగిన మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పులి శ్యాం ప్రవీణ్, ఇరుపోతు ఓబులేసు,పట్టణకన్వీనర్. కె.నాగేంద్రబాబు, కో-కన్వీనర్ పి.సి. కొండయ్య,పట్టణ నాయకులు జి.నాగార్జున, డి.హరి,¯ ఒ.శివకుమార్, జి.హుస్సేన్, ఓ.ప్రవీణ్ కుమార్,కరీం,ఓబులేసు, మైఖేల్, కె.సుభాషిణి, అరుణకుమారి, జయప్రద రత్నమ్మ, ప్రవీణ, బాలమ్మ, రాజేష్, నాగరాజు, రాయప్ప, మోక్షమ్మ, ప్రసాదు, వెంకటేశ్వర్లు, రాజారాం,చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పేకాట శిబిరాలపై పోలీసులు మెరుపు దాడి..




**31 మంది అరెస్ట్..**

**కాకినాడ, మార్చి 2 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జిల్లాలో జూదగృహాలపై జిల్లా పోలీసులు మెరుపు దాడులు చేసి 31 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1,36,930 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ఆదేశాలతో,కాకినాడ ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జగన్నాధపురం స్వప్న థియేటర్ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు మెరుపు దాడి చేసి 12 మంది అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 22,620 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసును కాకినాడ ఒకటో టౌన్ సీఐ నాగ దుర్గ రావు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దాపురం మండలం జె. తిమ్మాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై పెద్దాపురం ఎస్సై శ్రీమతి మౌనిక,తన సిబ్బంది తో దాడి చేసి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 9,210రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై పిఠాపురం సిఐ, పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ , తన సిబ్బంది తో కలిసి దాడి చేసి, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 8 మోటార్ సైకిళ్ళు 12,100రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని గొల్లపాలెం మండలం కోలంక గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై గొల్లపాలెం ఎస్సై మోహన్, తన సిబ్బంది తో కలిసి దాడి చేసి, 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, 93,000రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

# కేంద్రం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి




**కేంద్ర,రాష్ట్ర బడ్జెట్ లలో వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి.**

**రైతుల పంటలు కొనుగోలు చేయాలి..**

**మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలి.**

**5న ఏలూరు కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయండి**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపు..**

**ఏలూరు మార్చి 2 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** కేంద్ర మోడీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ లలో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని తదితర రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా జరుగుతున్న జిల్లా కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. ఆదివారం ఏలూరు అన్నే భవనంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి సమావేశం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, బి.కే.ఎం. యు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పి రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు బదులు మరింత ప్రమాదకర కొత్త చట్టాలు తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే వ్యవసాయ మార్కెట్లను ప్రైవేటీకరించేందుకు జాతీయ వ్యవసాయ మార్కెట్ ఫ్రేమ్ వర్క్ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నారని దీనివలన భవిష్యత్తులో రైతులు మద్దతు ధరలు కోల్పోతారని చెప్పారు. మరోవైపు నూతన సహకార చట్టం పేరుతో సహకార సొసైటీలను, పాల డైయిరీలను, మత్స్యకార సొసైటీలను, మొత్తం సహకార వ్యవస్థను నాశనం చేసే విధానాలను రూపొందిస్తున్నారని ఇది రైతాంగానికి అత్యంత ప్రమాదకరమన్నారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును యధావిధిగా అమలు చేస్తూ వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని, భవిష్యత్తులో రైతులు ఉచిత విద్యుత్ కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోరుతున్న చట్టాలు కాకుండా కార్పొరేట్ కంపెనీలు కోరుతున్న చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ కార్పొరేటీకరణ విధానాలు ఆపి కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు మార్కెట్ లో కనీస ధరలు రావడంలేదని, మిర్చి, పత్తి, కొబ్బరి,కోకో, వైట్ బర్లీ పొగాకు, పెసలు, మినుములు వంటి పంటలను ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిష్కారం అమలు చేయాలన్నారు. కార్మికు వ్యతిరేక నాలుగు లేబరు కోడ్ లను రద్దు చేయాలన్నారు. రైతాంగ, కార్మిక,ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ లలో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## స్వాతంత్ర్య సమరయోధురాలు "నైటింగేల్ ఆఫ్ ఇండియా" సరోజినీ నాయుడు

స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహిళల కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేసిన వారిలో సరోజినీనాయుడు ప్రముఖు రాలు. కవిత్వంతో మాధుర్యన్ని కురిపించి ' నైటింగేల్ ఆఫ్ ఇండియా' గా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచారు. భారత జాతీయ కాంగ్రెస్ తొలి మహిళా అధ్యక్షురాలిగా, స్వతంత్ర భారతదేశపు మొదటి మహిళా గవర్నరుగా పనిచేసిన ఆమె రాజకీయాల్లో మహిళలకు అత్యున్నతస్థానం సాధ్యమే అని నిరూపించారు.ఫిబ్రవరి 13, 1897న హైదరాబాద్ లోని బెంగాలీ బ్రాహ్మణ కుంటుంబంలో ఆమె జన్మించారు. తల్లిదండ్రులు అఘోరనాథ చటోపాధ్యాయ, వరద సుందరీ దేవి. శాస్త్రవేత్త,తత్వవేత్త అయిన అఘోరనాథ చటోపాధ్యాయ హైదరాబాద్లో నిజాం కాలేజీ ని స్థాపించి, ప్రిన్స్పాల్గా చాలా కాలం పనిచేశారు. తల్లి వరద సుందరీ దేవి కవియిత్రి. అమ్మనాన్నల అక్షరజ్ఞానాన్ని, సాహిత్యాభిరుచిని పుణికిపుచ్చుకున్న సరోజిని నాయుడు చిన్నతనం లోనే ఉర్దూ, తెలుగు, ఆంగ్లం, పర్షియన్, బెంగాలీ భాషలు అనర్గళంగా మాట్లాడేది. పిబిషెల్లీ కవిత్వాన్ని ఆమె చాలా ఇష్టపడేవారు.మహిళల విద్యపై అనేక ఆంక్షలు ఉన్న ఆ రోజుల్లోనే తల్లిదండ్రుల ప్రోత్సహంతో సరోజిని ఉన్నతవిద్యను అభ్యసించింది. 1891లో జరిగిన మెట్రిక పరీక్షలో రాష్ట్రం లోనే ప్రథమస్థానం లో ఉత్తీర్ణత పొందిన ఆమె అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆమె తెలివితేటలకు ఆశ్చర్య పడిన నిజాం నవాబు ఆమెను విదేశాలకు పంపించాడు. 1898 వరకు ఇటలీ,స్విట్జర్లాండ్ లో ఉండి అపారమైన విజ్ఞానాన్ని సంపాదించిన ఆమె ఎందరో ప్రపంచప్రఖ్యాతి గాంచిన రచయితల కవిత్వాలు, గ్రంథాలు చదివారు. ఎన్నో కవితలను రాసి విదేశీయుల ప్రసంశలను అందుకున్నారు. స్వదేశానికి తిరిగివచ్చిన తరువాత డిసెంబర్ 2, 1898లో డాక్టర్ గోవిందరాజులు నాయుడును ప్రేమవివాహము చేసుకున్నారు.

## జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో మహిళ సాధికారిక వారోత్సవాలు..




**బాపట్ల, మార్చి 2 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో మహిళా సాధికారత వారోత్సవాలుజిల్లా పోలీస్ అధికారులు ఘనంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిదిలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి సూచనలతో జిల్లా పోలీస్ శాఖ మార్చి 1వ తేదీ నుండి జిల్లాలో "మహిళా సాధికారత వారోత్సవాలు" ప్రారంభించారు. మార్చి 8వ తేది వరకు నిర్వహించనున్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతిని గురించి, మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలు గురించి అవగాహన కల్పించేందుకు, మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా మార్చి 2న ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో మహిళలకు, విద్యార్థిని లకు ప్రత్యేకంగా "యోగ" శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.యోగా, మెడిటేషన్ అనేవి భారతీయ సంస్కృతిలో ఒక భాగమని, ఇవి మన శరీరం, మనస్సులను సమతుల్యం చేస్తాయని, వీటిని అభ్యసించడం ద్వారా మానసిక వత్తిడిని జయించ గలుగుతామని, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, యోగా అభ్యాసం ద్వారా మనం పొందే ఉపయోగాలు అనేకమని, ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో యోగాసనాలు గురించి తెలుసుకొని వాటిని ఆచరించాలని పోలీసు అధికారులు సూచించారు.

## వృద్ధాశ్రమంలో బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు..



**బాపట్ల, మార్చి 2 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల పార్లమెంట్ సభ్యులు మరియు లోక్ సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా బాపట్ల లోని శ్రీ క్షీర భావన్నారాయణ స్వామి వారి గుడిని దర్శించికుని, స్వామి వారి కి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందుకున్న అందుకున్నారు అనంతరం బాపట్ల లోనే బదిరుల ఆశ్రమ పాఠశాల మరియు చీరాలలోని ఊటుకూరి వెంకటసుబ్బమ్మ వెల్ఫేర్ సొసైటీ వారి పాండురంగ వృద్ధాశ్రమం లో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు వృద్ధులకు చిన్నారులకు కేకు తినిపించి నూతన వస్త్రాలు పిల్లలకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ ఛైర్మెన్ సలగల రాజశేఖర్ బాబు, చీరాల నియోజకవర్గ అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఎంపీ వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు దుప్పట్లు, చీరలు, లుంగీలు, పండ్లు, స్వీట్స్, బిస్కెట్స్, చాక్లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

## వ్యాపారులు ప్లాస్టిక్ కు దూరంగా ఉండాలి..

**మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి..**



**బాపట్ల, మార్చి 2 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** వ్యాపారులు ప్లాస్టిక్ అమ్మకాల కు దూరంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల లో ఆదివారం ఉదయం మునిసిపల్ కమీషనర్ జి.రఘునాథ రెడ్డి పర్యటించారు. వార్డుల లో పారిశుధ్యం పై కార్మికులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు.పారిశుధ్యం విషయంలో అలసత్వం వద్దని సూచించారు.గృహ యజమానులు తడి చెత్త, పొడి చెత్త మరియు హానికర వ్యర్థాలుగా వేరు చేసిన తరువాత మాత్రమే పారిశుధ్య కార్మికులకు అందజేయాలనీ అన్నారు.హోమ్ కంపోస్టింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్లాస్టిక్ నిషేధం పై పట్టణ ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహనా కల్పించాలన్నారు. దుకాణదారులు ప్లాస్టిక్ అమ్మకాలు జరుపకూడదని అన్నారు.ప్రజలు గుడ్డ సంచులను ఉపయోగించాలన్నారు.పట్టణంలో నీటి సరఫరా విషయమై కొన్ని ప్రాంతాలానందు స్వయం గా క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. రోజు వారి సరఫరా విషయంలో ఇబ్బందులు ఉన్నాయా.? అంటూ కమిషన ప్రజలనే స్వయంగా అడిగి వివారాలు తెలుసుకున్నారు.జి.బి.సి. రోడ లో వాతావరణ పరిశీలిన శాల వద్ద శనివారం ఏర్పడిన లీకును,సరిచేసిన దానిని పరిశీలించారు.రాజీవ్ గాంధి కాలనీ హిందూ స్మశాన వాటిక లో వీధి కుక్కల శస్త్ర చికిత్స ల గదిని పరిశీలించారు. త్వరిత్తగతిన పనులను పూర్తిచేయాలనీ మునిసిపల్ ఇంజనీర్ ని కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

# ఉద్యోగ నిర్వహణలో క్రమశిక్షణ తో నిష్పక్షపాతంగా ఉండాలి..





**ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్..**

ప్రొబేషనరీ ఎస్సైలకు నియామక ఉత్తర్వుల అందజేత..

**ఏలూరు,మార్చి2 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** విధి నిర్వహణలో క్రమశిక్షణతో నిష్పక్షపాతంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజి జి వి జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ ఎస్సైలు ఏలూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, ఏలూరు రేంజ్ పరిధిలో ఎంపికైన ప్రొబేషనరీ ఎస్ఐలకు ఐజి అశోక్ కుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలోకి కొత్తగా చేరుతున్న అధికారులకు ముందుగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, బాధితులకు న్యాయం, ముద్దాయిలకు శిక్షలు కల్పించేలా పని చేయాలని సూచించారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులను నిర్వర్తించాలని సూచించారు. కొత్తగా శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొఫెషన్ ఎస్సైలు ఏలూరు రేంజ్ పరిధిలో 100 మంది ఉండగా 68 మంది పురుషులు, 32 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరికి ఆయా జిల్లాల్లో నియామక ఉత్తర్వులు ఐజి అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా 4,కాకినాడ జిల్లా 2,బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ 1,ఈస్ట్ గోదావరి 15,పశ్చిమగోదావరి జిల్లా1,ఏలూరు జిల్లా 1,కృష్ణాజిల్లా 20,ఎన్.టి.ఆర్ జిల్లా 56 మందిని కేటాయించారు.

# యర్రవరంలో సాయిబాబా ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన..

జడ్పీటీసీ నీరుకొండ రామకుమారి సత్యనారాయణ ప్రోత్సాహంతో గుడి నిర్మాణం..

శంఖుస్థాపనలో పాల్గొన్న సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు..

భారీగా పాల్గొన్న గ్రామ ప్రజలు..



**కాకినాడ జిల్లా మార్చి 2 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో ఏలేరు నది ఒడ్డున శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ సమీపంలో సాయిబాబా నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. మాజీ సర్పంచ్ నీరుకొండ సత్యనారాయణ,ఏలేశ్వరం మండల జడ్పిటిసి నీరుకొండ రామకుమారి,దంపతుల ప్రోత్సాహంతో గ్రామస్తుల చొరవతో ఈ నూతన షిరిడి సాయిబాబా ఆలయ నిర్మాణానికి పులివాసు,ఇందిరాజ్యోతి, దంపతుల చేతుల మీదుగా శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమం గ్రామ ప్రజల సమక్షంలో వేద పండితులు జరిపించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు,పలువురు గ్రామ పెద్దలు నేతలు హాజరై శంకుస్థాపన కార్యక్రమంలో చేతులు కలిపారు. గ్రామ మహిళలు భక్తి శ్రద్ధలతో శిరిడి సాయినాథుని జపిస్తూ శంకుస్థాపనలో నవధాన్యాలతో పూజలు చేపట్టారు. ఇప్పటికే ఈ నూతన ఆలయంలో ప్రతిష్ఠించే సాయిబాబా పాలరాతి విగ్రహం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఆలయ నిర్మాణం త్వరితగతిన నిర్మించే విధంగా పనిచేస్తానని అలా జరగాలని ప్రతి ఒక్కరూ భావాన్ని కోరుకోవాలని ఈ సందర్భంగా నీరుకొండ సత్యనారాయణ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు,బొడ్డు కృష్ణ, కేలంగి వీరబాబు,దాసరి భద్రరావు,బండారు నానాజీ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు,గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# పార్టీలకతీతంగా సహాయం చేసిన పార్టీ వైసీపీ..



**బాపట్ల జిల్లా మార్చి 2 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్ నిరాశపరిచిందని బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు ఆదివారం బాపట్ల వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఇచ్చిన సూపర్ 6 పథకాల హామీలు అమలుకు ఎటువంటి నిధులు కేటాయించలేదని చెప్పారు ప్రభుత్వం బడ్జెట్లో ఎదో ప్రకటించామని చెప్పుకోవడానికి తప్ప రాష్ట్రానికి ఎటువంటి ఉపయోగం లేదని పేర్కొన్నారు మెడికల్ కాలేజీల గురించి మాట్లాడనే లేదని తెలిపారు వైఎస్ఆర్సిపి సంబంధించిన శ్రేణులకు ఎవరికి ఎలాంటి పనులు చేయవద్దని ఎంతో అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనటం విడ్డూరంగా ఉందని కోన తెలిపారు గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అందరికీ వెసులుబాటు కలిగించి వైసీపీకి ఓటు వేసిన ఓటు వేయకపోయినా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమం అందరికీ అందజేశామని చెప్పారు రానున్న రోజుల్లో ప్రజలు ఇలాంటి మాటలు అనటం వలన అభద్రతాభావం కలుగుతుందని ఈ సందర్భంగా కోన రఘుపతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు కోకిల రాఘవరెడ్డి చిన్నపోతుల హరి చెంచయ్య సముద్రాల గౌడ్ వైసిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

## గుంటూరు, కృష్ణా... ఇప్పుడు చిత్తూరు

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ లో వరస అరెస్ట్ లు వైసీపీ నేతలను భయపెడుతున్నాయి. ఇప్పటికే అనేక మంది అరెస్టయ్యారు. కొందరు జైలుకు వెళ్లి బెయిల్ పై బయటకు వచ్చారు. మరికొందరు ఇంకా జైలులోనే రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఇప్పటికే మాచర్లమాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ లు జైలుకు వెళ్లి బెయిల్ పై బయటకు వచ్చారు. తర్వాత కొన్ని రోజుల క్రితం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా సినీ నటుడు పోసాని కృష్ణమురళికి రైల్వే కోడూరు కోర్టు పధ్నాలుగు రోజులు రిమాండ్ విధించింది. దీంతో పోసాని తర్వాత ఎవరు అరెస్ట్ అవుతారన్న దానిపై వైసీపీలో జోరుగా చర్చ జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన నాటి నుంచి టీడీపీ, జనసేన క్యాడర్ నుంచి ఒకటే డిమాండ్ వినపడుతుంది. తమ అధినేతలను,వారి కుటుంబాలను కించపర్చే విధంగా మాట్లాడిన వారిని ఇంకా ఎందుకు లోపలెయ్యలేదంటూ తెలుగు తమ్ముళ్లు ఆవేశంగా ప్రశ్నిస్తున్నారు. అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని చంద్రబాబు చెబుతూ వస్తున్నారు. కానీ తొమ్మిది నెలలవుతున్నా తమ అధినేతలను, కుటుంబ సభ్యులను కించపర్చిన వారిని అరెస్ట్ చేయకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అరెస్ట్ చేయాలంటూ నిలదీస్తున్నారు. నిజంగా ఇది అధికారంలో ఉన్న నేతలపై కొంత ఒత్తిడి పెరిగిందనే చెప్పాలి. కానీ ఇప్పుడు పోసాని తర్వాత ఎవరు అరెస్ట్ అవుతారన్న దానిపై పెద్దయెత్తున ఊహాగానాలు చెలరేగుతున్నాయి. మాజీ మంత్రి కొడాలి నాని ఇందులో ఫస్ట్ ప్లేస్ లో ఉన్నారని చెబుతున్నప్పటికీ, ఈసారి మాత్రం చిత్తూరు జిల్లాకు చెందిన ఒక నేతను అరెస్ట్ చేసే అవకాశాలున్నాయని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.

## నిధుల లేకుండానే నిర్మాణం

**విజయవాడ :** అసంబద్ధ రాష్ట్ర విభజన కారణంగా రాజధానిని కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ తమకంటూ అమరావతిని ప్రజా రాజధానిగా ఏర్పాటు చేసుకుందన్నారు పయ్యావుల కేశవ్. దీనికి ఆనాడు ఆమోదం తెలిపి.. అధికారంలోకి రాగానే మాట మార్చారని వైసీపీపై విమర్శలు చేశారు. మాట మార్చడమే కాకుండా.. అమరావతి విధ్వంసానికి కూడా నడుం బిగించారని ధ్వజమెత్తారు. నాటి ప్రభుత్వ అరాచక విధానాలపై అమరావతి రైతులు పోరుబాట పట్టి తమను తాము కాపాడుకుంటూ రాజధానిని కూడా కాపాడుకున్నారని కితాబు ఇచ్చారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా. రాజధాని పనులు పెద్ద ఎత్తున చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పయ్యావుల ప్రకటించారు. రాజధాని అనేది ఓ ప్రాంతం కోసం కాదు... రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేసే గ్రోత్ ఇంజిన్గా అమరావతిని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. మహారాష్ట్ర అభివృద్ధికి ముంబై ఎంత కీలకమో, తెలంగాణ వృద్ధికి హైదరాబాద్ ఎంత ముఖ్యమో, మనరాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి అమరావతి నిర్మాణం అంతే అవసరమన్నారు పయ్యావుల. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ప్రపంచ స్థాయి మౌలిక నదుపాయాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా అమరావతిని ముంబై, హైదరాబాద్‌తో నరితూగే ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ చేసిన కామెంట్స్ గుర్తు చేశారు. రాజధాని నిర్మాణం కోసం అంత డబ్బులు ఇవ్వలేం... కాబట్టే మూడు రాజధానుల ఏర్పాటు అన్నారన్ని తెలిపారు. రాజధాని వనుల నిర్మాణం కోసం బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదని వివరించారు. కానీ రాజధాని పనులు ప్రారంభం కాబోతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా అమరావతి సెల్ఫ్ సస్టైనబుల్ ప్రాజెక్టు అని మరోసారి పునరుద్ఘాటించారు.

## నేడు పిజిఆర్ఎస్ రద్దు..



**రాజమహేంద్రవరం, మార్చి 2 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 3 వ తేదీ సోమవారం పీజీఆర్ఎస్ రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు మీకోసం పోర్టల్ ద్వారా సచివాలయాల్లో ఆన్లైన్ ద్వారా అర్జీలు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మధ్య పి జి ఆర్ ఎస్ సెషన్‌లకు సంబంధించిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరగదని, ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాల కోసం ఎన్నికల కమిషన్ సూచనలు చేసినట్లు చెప్పారు. మార్చి 3 వ తేదీ సోమవారం పిజిఆర్ఎస్ నిర్వహించడం లేదని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం పోర్టల్ లో మీ సమీపంలో ఉన్న గ్రామ వార్డు సచివాలయాల్లో ఆన్లైన్ ద్వారా అర్జీలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు అమలులో ఉంటుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బైపాస్ సర్జరీ చేయించుకున్న గొల్ల మందలను పరామర్శించిన ఎమ్మెల్యే ..



**జంగారెడ్డిగూడెం, మే2(ప్రజా జ్యోతి ప్రతినిధి)** బై పాస్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండల తెదేపా ఎస్ సి సెల్ అధ్యక్షులు గొల్ల మందల శ్రీనివాసరావు ను చింతలపూడి శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ పరామర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ జంగారెడ్డిగూడెం రూరల్ మండలం అక్కంపేట లోని ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న శ్రీనివాసరావు గృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ధైర్యం గా ఉండాలని మీ వంటి సీనియర్ కార్యకర్తలను పార్టీ ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. శ్రీనివాస్ సతీమణి ఇతర కుటుంబ సభ్యులకు మేమున్నాం అని భరోసా కల్పించారు. కార్యక్రమం లో ఎమ్మెల్యే తో పాటు సీనియర్ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి,రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి దాసరి శేషు,రూరల్ పార్టీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ మరియు రాజాన పండు, బొబ్బర పాల్, కొండ్రెడ్డి కిషోర్,ఎం పి గౌడ్, మారిశెట్టి సత్యనారాయణ పారేపల్లి నరసింహమూర్తి అక్కంపేట తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు తారిపరెడ్డి రామకృష్ణ నీటి సంఘం అధ్యక్షులు ఆకుల సుబ్రహ్మణ్యం మాజీ సర్పంచ్ గంధం గోపాలకృష్ణ,లాగు ప్రకాష్, దాని గడప నరేష్, జొన్నకూటి శ్రీనివాస్ మండల ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి తాళ్లూరి వెంకటేశ్వరరావు తదితరులు వున్నారు.

## కాంట్రాక్టు లెక్చరర్స్ సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలి..

మంత్రి నాదెండ్లకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి...

గొర్ల మాణిక్యం వినతి పత్రం అందజేత...



**కాకినాడ జిల్లా మార్చి 2(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్ సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతూ కాంట్రాక్టు లెక్చరర్స్ 475 అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాణిక్యంగొర్ల పౌరసరఫరాలశాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ కి వినతి పత్రం అందజేశారు. జనసేన ప్లీనరీ సమావేశం భూమిపూజ నిమిత్తం పిఠాపురం విచ్చేసిన మంత్రి నాదెండ్లను కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి మాట్లాడుతూ క్యాబినెట్ లో మీ సమస్య పై చర్చిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికీ,విద్యాశాఖా మంత్రి లోకేష్ దృష్టికి విషయం తీసుకెళ్లి న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కాకర చిన్నబ్బాయి,జి.విజయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## పాండవులపాలెం గ్రామంలో మురళి రాజు పర్యటన




**కాకినాడ జిల్లా మార్చ్ 2 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు మండలం పాండవులపాలెం గ్రామంలో కనక దుర్గమ్మ ఆలయం విగ్రహం ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసి అమ్మవారి దర్శనం చేసుకొని ఆలయ కమిటీ సభ్యులకు 10000 రూపాయలు విరాళం అందజేసిన ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులు, సత్యనారాయణ కర్రి నాగేశ్వరరావు చామరి శ్రీను సీతారామరాజు రాంబాబు గా ,వైస్ ఎంపీటీసీ లోండ బాబు సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ మేక చంటిబాబు దేవ లక్ష్మణ్ విత్తనాలు నాగేశ్వరరావు దేవ వీరబాబు కొల్లుబోయిన ఏసుబాబు సతీష్ రాజు కోలా తాతబాబు బొల్లు నాగేశ్వరరావు జువ్వల దొరబాబు ముఖ్య నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# మహిళల ఆర్థిక అభ్యున్నతే సీఎం చంద్రబాబు లక్ష్యం







**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కుట్టు శిక్షణలు**

**త్వరలో ఉచిత బస్సు ప్రయాణం కూడా ప్రారంభం : బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**పెనుగొండ మార్చి 2:** ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లోనూ చదువుకున్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. మహిళల ఆర్థిక అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లక్షమందికి పైగా మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా కుట్టు మిషన్ కూడా అందజేయనున్నామని తెలిపారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా ప్రారంభించనున్నామన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సవిత మాట్లాడారు. మహిళల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తూ వస్తున్నాయన్నారు. అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సగం హక్కు కల్పించారని, మహిళా యూనివర్శిటీని కూడా స్థాపించారని గుర్తు చేశారు. రాజ్యాధికారంలోనూ భాగస్వామ్యం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు అన్నింటా మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. మహిళల పేరునే ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నారన్నారు. సంపద సృష్టిలోనూ ప్రాధాన్యమిస్తూ, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటులోనూ మహిళలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో సీఎం చంద్రబాబునాయు పాలన సాగిస్తున్నారన్నారు.

**విద్యార్థులందరికీ 'తల్లికి వందనం'**

ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లోనూ చదుకున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఇంట్లో ఎంతి మంది విద్యార్థులుంటే అందరికీ ఈ పథకం కింద ఏటా రూ.15 వేలు అందజేస్తామన్నారు. రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లక్ష మందికిపైగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. శిక్షణ అనంతరం కుట్టు మిషన్ కూడా అందజేయబోతున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని కూడా నెరవేర్చబోతున్నట్లు మంత్రి ప్రకటించారు.

**జాబ్ మేళాకు విశేష స్పందన**

ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఆధ్వర్యంలో జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిర్దేశించిన సమయానికి ముందే మహిళలు, యువకులు మంత్రి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలతో పాటు యువకులు కూడా ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు. జాబ్ మేళాలో పాల్గొన్నందరికీ ఉచిత భోజన వసతి సదుపాయాలను మంత్రి సవిత కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మోహినీ అలంకారంలో శ్రీ వేంకటేశ్వరస్వామి





**తిరుపతి మార్చి 2:** జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం 8 గంటలకు స్వామి వారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

బ్రహ్మోత్సవాలలో ఐదో రోజు ఉదయం సకల లోక కల్యాణకారకుడు అయిన శ్రీ వేంకటేశ్వరుడు దివ్యమోహినీ రూపంలో ఉత్సవమూర్తియై, తిరుచ్చిపై చిన్న కృష్ణుడు భక్తులను తన కృపాకటాక్షాలతో అనుగ్రహించారు. ఆ దివ్య మోహినీ మాయాశక్తికి వశమైన జగత్తు వాహ్య వాహకభేదాన్ని గుర్తుంచు కోలేకపోయింది. కనుక శ్రీవారు జగన్మోహినియై పల్లకీలో కూర్చొని ఉంటారు. ఈనాటి శ్రీవారి మోహినీ అవతారం భౌతికంగా జగన్మోహకత్వాన్నీ, ఆధ్యాత్మికంగా మాయాతీతశుద్ధ సత్త్వస్వరూప సాక్షాత్కారాన్ని ఏక సమయంలోనే సిద్ధింపజేస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు ఉన్నారు.

## రంజాన్ మాసం వేళ మసీదుల్లో ఎలాంటి సమస్యలు ఉండకూడదు

**తాగునీరు, విద్యుత్ కు అసౌకర్యం ఉండకూడదు**

**మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



**అనంతపురం మార్చి 2:** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభ సందర్భంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని మసీదుల్లో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజులపాటు అత్యంత నియమనిష్టలతో ఉపవాస దీక్షలు ఆచరించబోతున్న ప్రతి ఒక్కరికీ అల్లా దయతో అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం పరిధిలోని మసీదుల్లో ఉపవాస దీక్ష విరమణ, ప్రార్థనల సమయాలలో విద్యుత్, వాటర్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఇప్పటికే గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, విద్యుత్ అధికారులను ఆదేశించారు. అలాగే అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 4 పంచాయతీలలో మసీదులలో కూడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. ఉదయం సాయంత్రం వేళల్లో ఉపవాస దీక్ష పరులకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలి నూతన ట్రాఫిక్ నిబంధనల పైప్రజలకు అవగాహన కలిగించిన ధర్మవరం ట్రాఫిక్ ఎస్. ఐ. ఎస్.వెంకట రాముడు.

**ధర్మవరం మార్చి 2:** ధర్మవరం డి. ఎస్. పి. హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో వన్ టౌన్ సి. ఐ. నాగేంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు నూతన ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ నూతన ట్రాఫిక్ నిబంధనలు ప్రజలు తప్పని సరిగా పాటించాలనీ ప్రజలు పోలీసులకు సహకరించి సక్రమమైన ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ పోలీస్ డిపార్ట్మెంట్ వారికి సహకరిస్తూ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఆటో డ్రైవర్లకు,వాహనచోదకులు కచ్చితంగాట్రాఫిక్ నియమాలను పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని లేని పక్షంలో జరిమానా విధించడం జరుగుతుందని. ధర్మవరంలో ని ప్రధాన కూడళ్లలో



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ధర్మవరం ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ వెంకట రాముడు ఇతర సిబ్బంది.

## కర్నూల్ లో గంటెం ప్రభాకర్ కుమార్తె మానస వివాహానికి హాజరైన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



**పుట్టపర్తి మార్చి 2:** కర్నూల్ పట్టణంలోని లక్ష్మీ కళ్యాణ మండపం లో జరిగిన గుంతకల్లు కు చెందిన ఘంటేం ప్రభాకర్ యాదవ్ కుమార్తె మానస వెడ్స్ విశ్వనాథ్ గారి వివాహానికి పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్నూల్ పట్టణంలోని లక్ష్మీ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఈ వివాహానికి హాజరైన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి ఘంటెం కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. నూతన వధూవరులు డాక్టర్లు మానస ,విశ్వనాథ్ లను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆశీర్వదించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి వెంట జయపాల్ యాదవ్ , పెనుకొండ రమేష్నాయుడు ,రామమోహన్ ,సురేష్ ,వీరా ,శ్రీధర్ ,సుధాకర్ యాదవ్ ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్తు, రహదారుల సమస్యలు పరిష్కరించండి

**పరిటాల శ్రీరామ్ కు ఎస్.బ్రాహ్మణపల్లి గ్రామస్థుల విజ్ఞప్తి**





**ధర్మవరం మార్చి 2:** ధర్మవరం నియోజకవర్గం, ముదిగుబ్బ మండలంలోని ఎస్.బ్రాహ్మణపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్తు, రహదారుల సమస్యలు పరిష్కరించాలని ధర్మవరం టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ గారికి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మదనపల్లి నుండి ధర్మవరం వెళ్తూ గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాడైపోయిన విద్యుత్ పోల్స్, విద్యుత్ లైన్లు మార్చాలని, లో వోల్టేజి సమస్య పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా వీదులలో మరికొన్ని అదనపు విద్యుత్ పోల్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నీటి సమస్యను సైతం పరిష్కరించాలని, గాండ్లవారిపల్లి నుంచి ఎస్ బ్రాహ్మణపల్లికి, వలిమిచెర్లోపల్లి నుంచి ఎస్ బ్రాహ్మణపల్లి కి లింక్ రోడ్ సౌకర్యం కల్పించాలని వినతులు ఇచ్చారు. గ్రామస్తుల విజ్ఞప్తులను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ హామీ ఇచ్చారు..

## అనంతలో 03వ తేదీన కలెక్టరేట్ లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"

**- : సద్వినియోగం చేసుకోవాలి**

**- : రాప్తాడులో పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు.. ప్రజలు గమనించాలి**

**- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**



**అనంతపురం, మార్చి 02 :** అనంతపురం జిల్లా అనంతపురం నగరంలోఈనెల 03వ తేదీన అనంతపురం కలెక్టరేట్ లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు.

- ఇంతకుముందు రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి రాప్తాడు ఎంపిడిఓ కార్యాలయంలో ఈనెల 3వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రకటించడం జరిగిందని, కొన్ని అనివార్య కారణాలవల్ల రాప్తాడులో నిర్వహించదలచిన పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు..

## పుట్టిన రోజు సందర్భంగా మహిళ వృద్ధాశ్రమంలో అన్నదానం




**తూర్పుగోదావరి జిల్లా మార్చి 02:** పసలపూడి గ్రామానికి చెందిన నల్లమిల్లి వెంకట రెడ్డి సుజాత దంపతుల కుమారుడు నల్లమిల్లి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హెూప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనపర్తి శ్రీ తేతలి రామిరెడ్డి మంగాయామ్మ మహిళ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్దులకు ఉదయం మధ్యాహ్నం సాయంత్రం టిఫిన్స్ భోజనాలు, స్నాక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి, బర్ల సత్యనారాయణ మరియు వారి కుటుంబ సభ్యులు చింతా సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

- ఇద్దరు లబ్ధిదారులకు రూ.2,54,176 అందజేత
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం మార్చి 2:** అనారోగ్యం బారిన పడి ప్రైవేట్ ఆసుపత్రిలలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి 9 నెలల్లో 50 మందికి 69 లక్షలకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు ఇచ్చామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో 9వ విడత కింద ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. లక్ష్మీ నగర్ కు చెందిన హనుమక్కకు 36 వేల రూపాయలు, నాలుగవ రోడ్డుకు చెందిన రఫీద్దీన్ కి 2లక్షల 17వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి అందజేశారు. చెక్కులు అందుకున్న బాధితులు ఎమ్మెల్యే దగ్గుపాటికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు అర్బన్ నియోజకవర్గ పరిధిలో 50 మందికి 9 విడతల్లో 69 లక్షల 16వేల 183రూపాయలు సాయం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అడిగిన వెంటనే నియోజకవర్గంలో బాధితులకు సాయం అందిస్తున్నారన్నారు రాజకీయాల కతీతంగా సీఎంఆర్ఎఫ్ అందిస్తున్నట్లు చెప్పారు. అప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి వేగంగా జరుగుతోందని.. నెంబర్ వైపు సంక్షేమ పథకాలు కూడా అన్ని వర్గాలకు అందుతున్నాయన్నారు. అర్బన్ నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, టిడిపి నగర ఉపాధ్యక్షుడు గోళ్ల సుధాకర్ నాయుడు, బెస్ట్ సాధికార కమిటీ రాష్ట్ర నాయకుడు చేపల హరి, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుధిన్ తదితరులు పాల్గొన్నారు.

## అరటి ఎగుమతుల కోసం జిల్లాలో
# యూరోప్ దేశానికి చెందిన కంపెనీ ప్రతినిధి పర్యటన





జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ చొరవతో

**అనంతపురం, మార్చి 02 :** అనంతపురం జిల్లా నుంచి అరటి ఎగుమతులు చేసేందుకోసం యూరోప్ దేశానికి చెందిన కంపెనీ ప్రతినిధి జిల్లాలో ఆదివారం పర్యటించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశాల మేరకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో పలు ప్రాంతాల్లో యూరోప్ దేశానికి చెందిన faitrasa company ఫౌండర్ అండ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాట్రిక్ పర్యటించారు. ముందుగా రాప్తాడు మండలం రామినేపల్లిలోగల ఎలైట్ బయోటెక్ టిష్యూ కల్చర్ ల్యాబ్ సందర్శించి అందులో ఉత్పత్తి అవుతున్న టిష్యూ కల్చర్ అరటి మొక్కల వివరాలను లాబ్ ఎండి రాఘవేంద్ర నుంచి వివరాలు తెలుసుకున్నారు. తరువాత పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి విచ్చేసి SK బనానా company వారు అరటి తోటల నుంచి గెలలు ఎలా సేకరిస్తున్నారు, వాటిని ఎలా 13 కేజీలు మరియు ఏడు కేజీల బాక్సుల్లో ప్యాకింగ్ చేస్తున్నారు అనే విధివిధానాలను క్లీనింగ్ అండ్ ప్యాకింగ్ పద్ధతులను పరిశీలించారు. అలాగే ఫ్రూట్ కేర్ యాక్టివిటీలో భాగంగా అరటి గెలలను అధిక సూర్యరశ్మి నుంచి దుమ్ము మరియు పురుగులు తాకిడి నుంచి అరికట్టడానికి రైతులు పాటిస్తున్న గెలలకు కవర్లను వినియోగాన్ని రైతుల నుంచి ఆయన అడిగి తెలుసుకున్నారు. తదుపరి తాడిపత్రి మండలంలోని చుక్కలూరు గ్రామంలో ఉన్న సిద్ధార్థ కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ని సందర్శించి అక్కడ ఉన్న కోల్డ్ గదులను సందర్శించి సంతృప్తిని వ్యక్తం పరిచారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి సిద్ధార్థ కోల్డ్ స్టోరేజ్ కు వచ్చి యూరోప్ దేశానికి చెందిన పాట్రిక్ ని కలిసి తాడిపత్రి మరియు అనంతపురం రైతుల నుంచి అరటి, దానిమ్మ మొదలగు పండ్ల ఉత్పత్తులను సేకరించి యూరోప్ దేశాలకు ఎగుమతులు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఇరాన్, ఇరాక్, దుబాయ్ లాంటి అరేబియా దేశాలకు జిల్లా ఉత్పత్తులను పంపించడం జరుగుతోందని, స్విట్జర్లాండ్, ఇంగ్లాండ్, రష్యా లాంటి దేశాలకు కూడా జిల్లా ఉత్పత్తులని పంపించేందుకు కోసం యూరప్ ప్రతినిధిని జిల్లాకు పిలిపించి క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట జాయింట్ డైరెక్టర్ హార్టికల్చర్ దేవమునిరెడ్డి, రాప్తాడు ఉద్యాన అధికారి రత్నకుమార్, పుట్లూరు ఉద్యాన అధికారి శైలజ, తాడిపత్రి ఉద్యాన అధికారి ఉమాదేవి, గ్రామ ఉద్యాన సహాయకులు, ఎస్కే కంపెనీ ప్రతినిధి నరసింహారెడ్డి, గ్రీన్ ట్రాఫిక్ ప్రతినిధి రామోజీ, నోవా కంపెనీ ప్రతినిధి ప్రసాద్ రెడ్డి, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సాధికారిత వారోత్సవాల్లో
# మహిళలకు ప్రత్యేకంగా యోగ శిక్షణ





- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,
మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా యోగ తరగతులు

**విజయనగరం మార్చి 2:** మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో పోలీసు పరేడ్ గ్రౌండ్లో మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా యోగ తరగతులను నిర్వహించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మార్చి 2న తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - యోగ అనేది శరీరానికి, మనస్సుకి, ఆత్మకు శాంతి కలిగించే ప్రాచీనమైన సాధన అని అన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలను, ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూ, హార్మోనల్ సవాళ్లను ఎదుర్కొంటారని, వాటిని అధిగమించడానికి యోగ సాధన ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. యోగాతో హార్మోనుల సమతుల్యత సాధించి థైరాయిడ్, ఇతర అనారోగ్య సమస్యలను అధిగమించ వచ్చునన్నారు. యోగాతో మహిళల్లో సహనశక్తి పెరుగుతుందని, ఆందోళన, ఒత్తిడి, నిద్ర సమస్యలు తగ్గి, మానసిక ప్రశాంతత పొందవచ్చునన్నారు. నిరంతరం యోగ సాధన చేయడం వలన మహిళల్లో ఆలోచన శక్తి, ఏకాగ్రత పెరిగి, పనుల్లో మంచి నిర్ణయాలు తీసుకొంటూ, జీవితంలో సమర్ధవంతమైన వ్యక్తులుగా రాణిస్తారన్నారు. ప్రతీరోజూ యోగ సాధన చేయడంతో శారీక, మానసిక ఆనందాన్ని పొందవచ్చునని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. మహిళా పిఎస్ ఇన్స్పెక్టరు ఈ.నరసింహమూర్తి ఆధ్వర్యంలో యోగ శిక్షకులు మహిళా పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా యోగ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మహిళా పీఎస్ సిఐ ఈ.నరసింహమూర్తి, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, ఎస్సైలు పద్మావతి, నరసింగరావు, ఎఆర్ఎస్ఐ కే.రమేష్, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# మోహినీ అలంకారంలో శ్రీ వేంకటేశ్వరస్వామి

**తిరుపతి మార్చి 2:** జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం 8 గంటలకు స్వామి వారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలలో ఐదో రోజు ఉదయం సకల లోక కల్యాణకారకుడు అయిన శ్రీ వేంకటేశ్వరుడు దివ్యమోహినీ రూపంలో ఉత్సవమూర్తియై, తిరుచ్చిపై చిన్న కృష్ణుడు భక్తులను తన కృపాకటాక్షాలతో అనుగ్రహించారు. ఆ దివ్య మోహినీ మాయాశక్తికి వశమైన జగత్తు వాహ్య వాహకభేదాన్ని గుర్తుంచు కోలేకపోయింది. కనుక శ్రీవారు జగన్మోహినియై పల్లకీలో కూర్చొని ఉంటారు. ఈనాటి శ్రీవారి మోహినీ అవతారం భౌతికంగా జగన్మోహకత్వాన్నీ, ఆధ్యాత్మికంగా మాయాతీతశుద్ధ సత్త్వస్వరూప సాక్షాత్కారాన్ని ఏక సమయంలోనే సిద్ధింపజేస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు ఉన్నారు.

## శ్రీ పార్వతి సమేత శ్రీ కుటేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న నల్లమిల్లి దంపతులు.



**తూర్పుగోదావరి జిల్లా రిపోర్టర్ మార్చి 02:** అనపర్తి మండలం కుతుకులూరులో శ్రీ పార్వతి సమేత శ్రీ కుటేశ్వర స్వామి ఆలయం లో శ్రీ పార్వతి సమేత శ్రీ కుటేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్ని స్వామి వారిని దర్శించుకున్న అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, E.D. జాయింట్ డైరెక్టర్ కర్రి రాంగోపాల్ రెడ్డి I.R.S దంపతులు, న్యూఢిల్లీ, కుతుకులూరు గ్రామ NDA నాయకులు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ NDA నాయకులు, కుతుకులూరు గ్రామ NDA నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ మీడియా కన్వీనర్ గా మాళిగి భాను ప్రకాష్. నియామకం...









**కర్నూల్ మార్చి 2:** విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర సమావేశాలు ఈనెల మార్చి 1,2 తేదీల్లో నంద్యాల జిల్లా కేంద్రంలో జరుగుతూ ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలో రాష్ట్ర,జిల్లా, కార్యయకర్తల మార్పులు చేర్పులు , నూతన బాధ్యతలు ఇవ్వడం సర్వ సాధారణం ఈ సందర్భంగా కర్నూలు జిల్లా లో జిల్లా కార్యదర్శిగా ఉన్న మాళిగి భానుప్రకాష్ ఇంకా పై విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర మీడియా కన్వీనర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఈపూరి లక్ష్మి రాష్ట్ర దుర్గా వాహిని కన్వీనర్ గా, రాష్ట్ర మాతృశక్తి కో - కన్వీనర్ గా జంపాల రాధిక, విశేష సంపర్క విభాగ్ కన్వీనర్ గా నీలి నరసింహ, జిల్లా కార్యదర్శి గా ఈపూరి నాగరాజు , జిల్లా బజరంగ్ దళ్ గోరక్షా ప్రముఖ్ గా పరశురామ్ గార్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించారని రాష్ట్ర కార్యదర్శి పర్రె కోటేశ్వర రావు తెలియజేశారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవాలు

హాజరుకానున్న పరిటాల సునీత





**రాప్తాడు మార్చి 2:** రాప్తాడు నియోజకవర్గం, కనగానపల్లి మండలం, దాదులూరు గ్రామంలో, మార్చి 3, 4వ తేదీలలో అనగా రేపటి నుంచి రెండు రోజులపాటు జరగబోవు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారు, శ్రీ బంగారు లింగమయ్య స్వామి వారు, శ్రీ పోతలయ్య స్వామి వార్ల ఉత్సవాలను పురస్కరించుకొని ఈరోజు స్థానిక నాయకులతో కలసి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి, శ్రీ బంగారు లింగమయ్య స్వామి, శ్రీ పోతలయ్య స్వామి వార్లను దర్శించుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ అధికారులు ఇద్దరు ప్రజా ప్రతినిధులు.

## మాజీ సాగు నీటి సంఘం అధ్యక్షులు దండు వెంకట రాముడు కు ఘనంగా నివాళులు అనాథ ఆశ్రమం లో అన్నదానం



**ధర్మవరం మార్చి 2:** ధర్మవరం మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు దండు వెంకటరాముడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఆదివారం గొట్లూరు అనాధాశ్రమంలో అన్నదానం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా దండు వెంకట రాముడు పేరు పొందారన్నారు. ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దండు కుటుంబ సభ్యులు దండు వెంకటేష్ శ్రీ మతి భువనేశ్వరి, వెన్నెల, పవన్ కుమార్, బాలాజీ, శ్రీ దేవి, లలిత, తేజస్విని తదితరులు పాల్గొన్నారు..

## లిరౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చిన ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్



**ధర్మవరం మార్చి 2:** ధర్మవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ రౌడీ షీటర్లతో మాట్లాడుతూ.. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప, పోలీసులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యానికి అరటిపండు ఎలాంటి మేలు చేస్తుంది..?



అరటిపండు పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే పండు. ఇది ఏడాది పొడవునా మార్కెట్లో లభిస్తుంది. అరటిపండు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి, విటమిన్ ఏ , మెగ్నీషియం, రాగి మొదలైన అనేక పోషకాలు ఉన్నాయి, ఇవి శరీరానికి శక్తిని అందించ డానికి, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, జీర్ణక్రియను మెరుగుపరచ డానికి, మానసిక స్థితిని సమతుల్యం చేయడానికి, చర్మాన్ని మెరుగు పరచడానికి ఒక అద్భుతమైన ఎంపిక.

**చర్మానికి మేలు..**

అరటిపండులో విటమిన్ సి, ఇతర యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి చర్మాన్ని సంరక్షించడంలో సహాయపడతాయి. ఇవి చర్మాన్ని మెరుగుపరచడంలో ఉపయోగపడుతాయి. అంతేకాకుండా, ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో శరీరం నుంచి హానికరమైన అంశాలను తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**జీర్ణక్రియ ..**

అరటిపండులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో పెక్టిన్ అనే సమ్మేళనం ఉంటుంది, ఇది కడుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి అవసరం..**

అరటిపండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది, ఇది బిపిని నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది.
పొటాషియం సాధారణ హృదయ స్పందనను నిర్వహిస్తుంది. రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**మానసిక ఆరోగ్యానికి..**

అరటిపండ్లలో విటమిన్ బి6 ఉంటుంది, ఇది మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశను తగ్గించడంలో సహాయపడుతుంది.

# చేదుగా ఉండే ఈ ఆహారాలను దూరం పెట్టకండి



ప్రస్తుత తరుణంలో చాలా మంది కేవలం తీపి రుచికే అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. తీపి పదార్థాలు అంటే సహజంగానే చాలా మందికి ఎంతో ఇష్టం ఉంటుంది. అందుకనే ఇతర రుచులు ఉండే ఆహారాలను తక్కువ తింటుంటారు. అయితే వాస్తవానికి తీపి పదార్థాలను అతిగా తినడం మంచిది కాదు. ఆయుర్వేదం కూడా రోజూ మనం అన్ని రకాల రుచులు కలిగిన ఆహారాలను తినాలని చెబుతుంటుంది. కనుక అన్ని రుచులను మనం ప్రతి రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కొందరు చేదు రుచిని పక్కన పెడుతుంటారు. చేదుగా ఉండే ఆహారాలను కనీసం ముట్టుకోరు. కానీ వీటిని తింటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. చేదుగా ఉండే ఆహారాలను కూడా తరచూ తినాల్సి ఉంటుంది. ఈ పదార్థాలు మనకు కలిగే పలు వ్యాధులను నయం చేస్తాయి.

**ఉసిరికాయలు..**

ఉసిరికాయలు అంటే చాలా మందికి ఇష్టమే. చాలా మంది నేరుగా వీటిని తింటుంటారు. కొందరు వీటితో పులిహోర, పచ్చడి, పప్పు వంటివి చేస్తుంటారు. అయితే ఉసిరికాయల్లో సహజంగానే పులుపు అధికంగా ఉంటుంది. కానీ వాస్తవానికి ఇవి కాస్త చేదు రుచిని కూడా కలిగి ఉంటాయి. కనుక ఉసిరికాయలను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. దీని జ్యూస్‌ను కూడా తాగవచ్చు. ఉసిరికాయల్లో విటమిన్ సితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలోని వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. ఉసిరికాయలు యాంటీ ఏజింగ్ గుణాలను కలిగి ఉంటాయి. కనుక వీటిని తీసుకుంటే చర్మ కాంతి పెరుగుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. కలబంద రసం కూడా కాస్త చేదు రుచిని కలిగి ఉంటుంది. కనుక దీన్ని కూడా ఆహారంలో భాగం చేసుకోవాల్సి ఉంటుంది.

**కలబంద, పసుపు..**

కలబందలో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కలబంద రసాన్ని తాగుతుంటే జీర్ణ సమస్యలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. ఇక పసుపును మనం నిత్యం వంటల్లో వేస్తుంటాం. ఇది కూడా చేదు రుచినే కలిగి ఉంటుంది. పసుపుతో టీ తయారు చేసి తాగవచ్చు. లేదా పాలలో పసుపు కలిపి తాగవచ్చు. పసుపులో యాంటీ ఇన్ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. పసుపులో ఉండే కర్ క్యుమిన్ అనే సమ్మేళనం రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది.

**వేపాకులు..**

వేపాకులు చేదుగా ఉంటాయనే విషయం తెలిసిందే. కానీ వీటిని కూడా తరచూ తినాలి. ముఖ్యంగా రోజూ ఉదయాన్నే పరగడుపునే వేపాకులను తింటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. చర్మం ఆరోగ్యంగా ఉండడంతోపాటు షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. కాకరకాయ కూడా చేదుగా ఉంటుందనే విషయం తెలిసిందే. దీన్ని తీసుకుంటున్నా కూడా షుగర్, కొలెస్ట్రాల్, అధిక బరువును తగ్గించుకోవచ్చు. దీంతో బీపీ కూడా అదుపులోకి వస్తుంది. ఇక చేదుగా ఉండే మరొక పదార్థం మెంతులు.

# దేనికెంత సమయం?



ఆరోగ్యంగా ఉండాలనే ఆశ ఉంటే అలవాట్లను మార్చుకునే పని మొదలుపెట్టాలి.అలవాట్లు మార్చుకోవాలంటే ఆహారం పట్ల, అవసరాల పట్ల అవగాహన ఉండాలి. ఎప్పుడు తినాలి? ఎంత తినాలి? తెలుసుకున్నట్టుగానే.. తింటే అరగడానికి ఎంత సమయం పడుతుందో కూడా అవగాహన ఉండాలి. లేకుంటే తిన్నది ఖర్చు కాకముందే మళ్లీ తింటే అరగదు. తిన్నదీ ఒంటబట్టదు. హాయిగా నిద్రపట్టాలన్నా, ఆరోగ్యంగా ఉండాలన్నా మితంగా తినాలి. ఆయా పదార్థాలు జీర్ణమయ్యే కనీస సమయాల వివరాలివి. ఈ లెక్కల ఆధారంగా చిక్కుల్లేకుండా ఆరగింపు సేవలో తరించండి.

**వండిన కూరలు**

40 నిమిషాలు సంక్లిష్టమైన ఆహారాన్ని జీర్ణవ్యవస్థ ఎంజైముల సహకారంతో సరళమైన ఆహారంగా మారుస్తుంది. కూరగాయలను ఉడికించడం వల్ల ఇలాంటి మార్పు కొంత జరుగుతుంది. పచ్చి కూరగాయల కంటే ఉడికించిన కూరగాయలు తొందరగా జీర్ణమవుతాయి.

**పచ్చి కూరగాయలు**

30 నుంచి 40 నిమిషాలు కార్బొహైడ్రేట్లతోపాటు విటమిన్లు, ఖనిజ పోషకాలు కూరగాయల్లో అధికంగా ఉంటాయి. వీటితోపాటు యాంటి ఆక్సిడెంట్లు కూడా కూరగాయల నుంచి లభిస్తాయి. కొవ్వులు అతిస్వల్పంగా ఉంటాయి. 100 గ్రాముల కూరగాయల్లో 0.2 గ్రాముల కొవ్వు ఉంటుంది. కాబట్టి తేలికగా, తొందరగా జీర్ణం అవుతుంది.

**గుడ్డు**

30 నిమిషాలు గుడ్డు తేలికైన ఆహారమే! ఇందులోని తెల్లసొన మాత్రమే తీసుకుంటే అరగంటలో జీర్ణం అవుతుంది. గుడ్డు మొత్తం తిన్నారనుకోండి ఇంకో పదిహేను నిమిషాలు ఎక్కువ సమయం పడుతుంది.

**పండ్లు**

15-20 నిమిషాలు నీటి శాతం అధికంగా ఉండి, కొవ్వులు అతి స్వల్పంగా ఉండటం వల్ల పండ్లు వేగంగా జీర్ణమవుతాయి. వీటిలో ఉండే ఎంజైములు జీర్ణక్రియను మరింత వేగవంతం చేస్తాయి.

**మంచినీళ్లు**

మంచినీళ్లలో పోషకాలు ఉండవు. కాబట్టి జీర్ణరసాలతో కూడిన జీర్ణక్రియ కూడా అవసరం లేదు. అందువల్ల తాగిన నీళ్లు తాగినట్టే జీర్ణాశయం నుంచి పేగుల్లోకి జారుకుంటాయి.

ఆలుగడ్డలు

90-120 నిమిషాలు ఆలుగడ్డల్లో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి ఎంజైమ్‌లకు అంత తొందరగా లొంగవు. ఆలుగడ్డతో వండిన ఆహార పదార్థాలు నిదానంగా జీర్ణం అవుతాయి.

**మాంసం (రెడ్ మీట్)**

3-4 గంటలుమాంసంలో కొవ్వులతోపాటు మాంసకృత్తులు కూడా అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది.

**నట్స్ (డ్రైఫ్రూట్స్)**

180 నిమిషాలు ఇవి సూక్ష్మ పోషకాల గనులు. విటమిన్లు, ఖనిజ పోషకాలు ఎక్కువగా ఉంటాయి. 100 గ్రాముల నట్స్‌లో 54 గ్రాముల కొవ్వులు, 21 గ్రాముల కార్బొహైడ్రేట్స్ ఉంటాయి.

**చేపలు**

45 నుంచి 60 నిమిషాలు సాధారణంగా మాంసాహారం అంటే అధికంగా కొవ్వు ఉండేవని భావిస్తాం. కానీ, చేపల్లో కొవ్వులు తక్కువగా ఉంటాయి. వంద గ్రాముల చేప మాసంలో 12 గ్రాముల కొవ్వు ఉంటుంది. డ్రైఫ్రూట్స్‌లో ఉండే కొవ్వుల కంటే ఇది తక్కువ. అందుకే ఇతర మాంసాహార పదార్థాల కన్నా ఇది తేలికగా జీర్ణమవుతుంది.

**పాలు**

120 నిమిషాలు పాలలో 4-5 శాతం కొవ్వులు ఉంటాయి. అలాగే 4-5.5 శాతం మాంసకృత్తులు ఉంటాయి. పాలలో లాక్టోజ్‌ని జీర్ణం చేయడానికి జీర్ణాశయంలోని ఎంజైమ్‌లు ఎక్కువ సమయం తీసుకుంటాయి. కాబట్టి పాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. పాలతో తయారుచేసిన తక్కువ కొవ్వు ఉండే జున్ను, వెన్న తీసిన పాలు, మిల్క్ ఐస్‌క్రీమ్‌లు జీర్ణం కావడానికి గంటన్నర సమయం పడుతుంది.

# ఏ అనేక వ్యాధులను తగ్గించే కరక్కాయ.. దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

ఆయుర్వేదంలో త్రిఫలాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్న సంగతి తెలిసిందే. త్రిఫలాలు అంటే.. కరక్కాయ, తానికాయ, ఉసిరికాయలను త్రిఫలాలుగా పిలుస్తారు. ఈ మూడింటినీ సమ పాళ్లల్లో కలిపి తయారు చేసిన త్రిఫల చూర్ణాన్ని ఔషధంగా ఉపయోగిస్తుంటారు. అయితే త్రిఫలాల్లో ఒకటైన కరక్కాయను నేరుగా తీసుకోవచ్చు. దీన్ని త్రిఫల చూర్ణంలో భాగం చేయాల్సిన పనిలేదు. కరక్కాయను పొడి చేసి నేరుగా తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. పలు రకాల వ్యాధులను తగ్గించేందుకు కరక్కాయ ఎంతగానో పనిచేస్తుంది. కరక్కాయను ఏ విధంగా ఉపయోగిస్తే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**జీర్ణ వ్యవస్థకు..**

కరక్కాయను తినడం వల్ల మన జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. కరక్కాయ జీర్ణక్రియను పెంపొందిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. విరేచనం సాఫీగా అయ్యేలా చేస్తుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కరక్కాయ సహజసిద్ధమైన డిటాక్సిఫైర్‌లా పనిచేస్తుంది. శరరీంలోని వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపుతుంది. దీని వల్ల అనేక రోగాల బారి నుంచి బయట పడవచ్చు. ఆరోగ్యంగా ఉంటారు. కరక్కాయను తరచూ తీసుకుంటే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. దీంతో శరీరం ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు, క్రిములకు వ్యతిరేకంగా పోరాడుతుంది.

**వాపులు, నొప్పులు..**

కరక్కాయలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల దీన్ని తీసుకుంటే శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ లేదా గౌట్ ఉన్నవారికి కరక్కాయ ఎంతగానో మేలు చేస్తుంది. ఆయా వ్యాధుల నుంచి బయట పడవచ్చు. కరక్కాయ మన శ్వాసకోశ వ్యవస్థకు కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇది దగ్గు, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. వాపుల నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. దీంతో ముక్కు దిబ్బడ కూడా తొలగిపోతుంది. కరక్కాయ మన హృదయ సంబంధ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. దీంతో శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె కండరాలు బలంగా మారుతాయి. దీని వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

**లివర్ ఆరోగ్యానికి..**

కరక్కాయ లివర్ ఆరోగ్యాన్ని కూడా మెరుగు పరుస్తుంది. లివర్ శుభ్రంగా మారేలా చేస్తుంది. దీన్ని తింటుంటే లివర్‌లోని వ్యర్థాల, టాక్సిన్లు బయటకుపోతాయి. ఫ్రీ ర్యాడికల్స్, టాక్సిన్ల వల్ల లివర్‌కు కలిగే నష్టం నివారించబడుతుంది. అలాగే చర్మాన్ని సంరక్షించే గుణాలు కూడా కరక్కాయలో ఉంటాయి. మొటిమలు, గజ్జి, తామర, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలను కరక్కాయ తగ్గిస్తుంది. కరక్కాయలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీని వల్ల వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. ఇలా కరక్కాయతో మనం అనేక ప్రయోజనాలను పొందవచ్చు. దీన్ని పొడిగా చేసి కూడా ఉపయోగించవచ్చు. లేదా చిన్న ముక్కను నోట్లో వేసుకుని చప్పరిస్తూ రసం మింగవచ్చు. ఇలా కరక్కాయను తీసుకుంటే పైన తెలిపిన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



# బిజినెస్

## జీఎస్టీ వసూళ్లు 1.84 లక్షల కోట్లు

### గతంతో పోల్చితే ఫిబ్రవరిలో 9.1 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ :** జీఎస్టీ వసూళ్లు మరోసారి భారీ స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో రూ. 1.84 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో వసూలైన రూ. 1.68 లక్షల కోట్లతో పోలిస్తే 9.1 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది. దేశీయ వినిమయం పుంజుకోవడం, ఆర్థిక రంగం తిరిగి వృద్ధి బాట పట్టడం వల్లనే జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదవుతునాయని వెల్లడించింది. గత నెలలో వసూలైన రూ. 1.84 లక్షల కోట్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ. 35,204 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ. 43,704 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ. 90,870 కోట్లు, పరిహారం సెస్ రూపంలో రూ. 13,868 కోట్లు వచ్చాయని పేర్కొంది. జీఎస్టీ వసూళ్లలో దేశీయంగా వచ్చిన ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10.2 శాతం ఎగబాకి రూ. 1.42 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్ను ద్వారా రూ. 41,702 కోట్లు సమకూరాయి. అలాగే రూ. 20,889 కోట్ల పన్నును రిఫండ్ రూపంలో చెల్లించింది. ప్రస్తుత సంవత్సరం తొలి నెల జనవరిలో రూ. 1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి. దీనిపై ఈవై ట్యాక్స్ పార్టనర్ సౌరభ్ అగర్వాల్ మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శణమని, అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితిలో ఉన్నప్పటికీ పన్ను వసూళ్లు ఇంచుమించు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషమన్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లు 10 శాతం నుంచి 20 శాతం వరకు అధికమవగా, అలాగే తెలంగాణతోపాటు గుజరాత్, అసోం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో 1 శాతం నుంచి 4 శాతం వరకు పెరిగాయి.




## అల్ట్రాటెక్‌లో కేశోరాం విలీనం

ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్‌లో బీకే బిర్లా గ్రూపునకు చెందిన కేశోరాం సిమెంట్ విలీనమయ్యాయి. ఇందుకు సంబంధించి పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్ వద్ద ఉన్న యూనిట్‌లో ఇందుకు సంబంధించి అధికారిక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 50 ఏండ్ల క్రితం ఉత్తర తెలంగాణలోని బసంత్‌నగర్‌లో బీకే బిర్లా సిమెంట్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ఆతర్వాతి క్రమంలో ఇక్కడే కేశోరాం సిమెంట్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం ఈ కేశోరాం సిమెంట్‌ను ఆదిత్యా బిర్లా గ్రూపు కొనుగోలు చేయడంతో ఇకనుంచి ఈ ప్లాంట్‌లో అల్ట్రాటెక్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శనివారం ఈ యూనిట్‌లో కార్మికులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటుచేసి, అధికారికంగా అల్ట్రాటెక్ లోగోను ఆవిష్కరించారు.




# మార్చిలో స్టాక్ మార్కెట్ సెలవులు

ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చిలో ముగియనుంది. దీంతో ఇన్వెస్టర్లు ఈ నెలలో ట్రేడింగ్‌కు సిద్ధమవుతున్నారు. అయితే ట్రేడింగ్‌ను బాగా ప్లాన్ చేయడానికి మార్చి నెలలో స్టాక్ మార్కెట్ ఏయే రోజుల్లో పనిచేస్తుంది.. ఎప్పుడు మూసివేత ఉంటుంది అన్నది తెలుసుకోవడం మంచిది. ఈ హాలిడే క్యాలెండర్ ను స్టాక్ ఎక్స్ఛేంజీలు జారీ చేస్తాయి. తమ అధికారిక వెబ్ సైట్‌లలో ఇవి అందుబాటులో ఉంటాయి. బీఎస్ఈ ప్రతి సంవత్సరం పూర్తి ట్రేడింగ్ హాలిడేస్ జాబితాను ప్రచురిస్తుంది. సాధారణంగా ఈ జాబితాలో పండుగలు, జాతీయ సెలవులు, వారాంతపు సెలవులు ఉంటాయి. బడ్జెట్ సమర్పణ వంటి ప్రత్యేక సందర్భాలు మినహా అన్ని వారాంతాల్లో స్టాక్ మార్కెట్లు ట్రేడింగ్‌కు అందుబాటులో ఉండవు. అందువల్ల మార్కెట్ షెడ్యూల్‌ను తెలుసుకుని తదనుగుణంగా ట్రేడింగ్‌ను ప్లాన్ చేయడానికి ఇన్వెస్టర్లు సెలవుల జాబితాపై ఆధారపడాలి. మార్చిలో స్టాక్ మార్కెట్ కు 12 రోజులు సెలవులు ఉంటాయి. ఇన్వెస్టర్లు ఈ రోజుల్లో మార్కెట్లో ఎలాంటి ట్రేడింగ్ లు చేయలేరు. వారాంతపు సెలవులతో పాటు ఈ నెలలో హెూలీ, రంజాన్ పండుగకు కూడా మార్కెట్లు మూతపడతాయి. అందువల్ల మార్చిలో చివరి ట్రేడింగ్ రోజు 28వ తేదీ. ఎందుకంటే 29, 30 తేదీలు వారాంతపు సెలవులు. ఆ రోజుల్లో మార్కెట్లు పనిచేయవు.

**మార్చిలో స్టాక్ మార్కెట్ సెలవులు ఇవే**

- మార్చి 1 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 2 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 8 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 9 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 14 శుక్రవారం హెూలీ
- మార్చి 15 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 16 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 22 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 23 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 29 శనివారం వీకెండ్ హాలిడే
- మార్చి 30 ఆదివారం వీకెండ్ హాలిడే
- మార్చి 31 సోమవారం ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)




# ఇకపై పాస్‌పోర్ట్ కావాలంటే..

పాస్‌పోర్టుల జారీకి సంబంధించిన నిబంధనలలో భారత ప్రభుత్వం తాజాగా మార్పులు చేసింది. పాస్‌పోర్టుల జారీ కోసం సమర్పించే పుట్టినరోజు తేదీ రుజువుకు సంబంధించిన నిబంధనలకు సవరణలు ప్రకటిస్తూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. పాస్‌పోర్ట్ (సవరణ) నిబంధనలు, 2025 లో భాగమైన ఈ మార్పులు పాస్‌పోర్ట్ దరఖాస్తు ప్రక్రియను క్రమబద్ధీకరించడం, అవసరమైన డాక్యుమెంటేషన్‌లో ఏకరూపతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

నిబంధనల్లో కీలక మార్పులు

2023 అక్టోబర్ 1 లేదా ఆ తర్వాత జన్మించిన పిల్లలకు జనన మరణాల రిజిస్ట్రార్, మునిసిపల్ కార్పొరేషన్ లేదా జనన, మరణాల నమోదు చట్టం, 1969 ప్రకారం అధికారం ఉన్న ఏదైనా ఇతర అథారిటీ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం మాత్రమే పుట్టిన తేదీకి చెల్లుబాటు అయ్యే రుజువు అని కొత్త నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. ఈ మార్పు శిశువులకు జనన ధృవీకరణ పత్రాన్ని పొందాల్సిన ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. అలాగే పుట్టిన తేదీని అధికారిక రికార్డులలో ఖచ్చితంగా నమోదు చేసేలా చేస్తుంది.

2023 అక్టోబర్ 1 కంటే ముందు జన్మించిన వారికి పుట్టిన తేదీకి సంబంధించి అనుమతించదగిన రుజువులు మరింత సరళంగా ఉంటాయి. ఈ కింది డాక్యుమెంట్లను డేట్ ఆఫ్ బర్త్ ప్రూఫ్‌గా ఆమోదిస్తారు.




జనన మరణాల రిజిస్ట్రార్, మునిసిపల్ కార్పొరేషన్ లేదా జనన మరణాల నమోదు చట్టం, 1969 ప్రకారం అధికారం ఉన్న మరేదైనా అథారిటీ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం.

దరఖాస్తుదారు పుట్టిన తేదీని కలిగి ఉన్న గుర్తింపు పొందిన పాఠశాల లేదా గుర్తింపు పొందిన విద్యా బోర్డు జారీ చేసిన బదిలీ లేదా స్కూల్ లీవింగ్ లేదా మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్.

దరఖాస్తుదారు పుట్టిన తేదీతో ఆదాయపు పన్ను శాఖ జారీ చేసే శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) కార్డు.

దరఖాస్తుదారు పుట్టిన తేదీ ఉండే సర్వీస్ రికార్డ్ ఎక్స్‌ట్రాక్ట్ లేదా వేతన పెన్షన్ ఆర్డర్ కాపీలు (ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తాయి). వీటికి సంబంధిత మంత్రిత్వ శాఖ లేదా దరఖాస్తుదారు అడ్మినిస్ట్రేషన్ ఇన్చార్జి అధికారి ధ్రువీకరణ ఉండాలి.

దరఖాస్తుదారు పుట్టిన తేదీతో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్.

దరఖాస్తుదారు పుట్టిన తేదీతో కూడిన ఎన్నికల సంఘం జారీ చేసిన ఎలక్షన్ ఫోటో ఐడీ కార్డు.

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లేదా ప్రభుత్వ కంపెనీలు జారీ చేసే పాలసీ బాండ్. ఇందులో బీమా పాలసీ హెూల్డర్ పుట్టిన తేదీ ఉంటుంది.

దరఖాస్తుదారులపై ప్రభావం

కొత్త నిబంధనలు ప్రధానంగా 2023 అక్టోబర్ 1 లేదా తరువాత జన్మించిన పిల్లల తల్లిదండ్రులను ప్రభావితం చేస్తాయి. వారు పాస్‌పోర్ట్ దరఖాస్తులకు పుట్టిన తేదీ ఏకైక రుజువుగా జనన ధ్రువీకరణ పత్రాన్ని పొందాల్సి ఉంటుంది. ఈ మార్పు డాక్యుమెంటేషన్ ప్రక్రియను ప్రామాణీకరించడం, పుట్టిన తేదీ రికార్డులలో వ్యత్యాసాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 2023 అక్టోబర్ 1 కంటే ముందు జన్మించినవారిపై మాత్రం ఎటువంటి ప్రభావం ఉండదు. పాస్‌పోర్ట్ కోసం వారు ఎప్పటిలాగే వివిధ రకాల డేట్ ఆఫ్ బర్త్ ప్రూఫ్‌లను సమర్పించవచ్చు.

# స్పోర్ట్స్

# న్యూజిలాండ్‌పై విజయం..

# ఆసీస్‌తో భారత్ సెమీస్ మ్యాచ్

దుబాయ్: ఛాంపియన్స్ ట్రోఫీలో లీగ్ దశను టీమ్‌ఇండియా ఓటమి లేకుండా ముగించింది. ఇప్పటికే సెమీస్ చేరిన భారత జట్టు.. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో గ్రూప్-ఎలో అగ్రస్థానంలో నిలిచిన టీమ్‌ఇండియా.. మంగళవారం (మార్చి 4) జరిగే తొలి సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో భారత స్పిన్నర్ల ధాటికి న్యూజిలాండ్ 45.3 ఓవర్లలో 205 పరుగులకే కుప్పకూలింది. కేన్ విలియమ్సన్ (81బీ 120 బంతుల్లో 7 ఫోర్లు) ఒక్కడే పోరాడాడు. మిచెల్ శాంట్నర్ (28), విల్ యంగ్ (22), డారిల్ మిచెల్ (17), టామ్ లేథమ్ (14), గ్లెన్ ఫిలిప్స్ (12) పరుగులు చేశారు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన రెండో వన్డేలోనే ఐదు వికెట్ల ప్రదర్శనతో (5/42) అదరగొట్టాడు. కుల్‌దీప్ యాదవ్ 2, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత బ్యాటర్లలో శ్రేయస్ అయ్యర్ (79బీ 98 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అక్షర్ పటేల్ (42బీ 61 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. చివర్లో హార్దిక్ పాండ్య (45బీ 45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలు) దూకుడుగా ఆడాడు.




కేఎల్ రాహుల్ (23), రవీంద్ర జడేజా (16) పరుగులు చేశారు. రోహిత్ శర్మ (15), శుభ్‌మన్ గిల్ (2), విరాట్ కోహ్లి (11) నిరాశపర్చడంతో భారత్ 30 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో శ్రేయస్, అక్షర్ పటేల్ టీమ్‌ఇండియాను ఆదుకున్నారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. చివర్లో హార్దిక్ మెరుపులు మెరిపించడంతో భారత్ పోరాడే స్కోరు సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 5, జేమీసన్, విలియం ఓరూర్క్, శాంట్నర్, రచిన్ రవీంద్ర ఒక్కో వికెట్ తీశారు.

## ఎవరికీ సాధ్యం కాని ఘనతను సొంతం? చేసుకున్న న్యూజిలాండ్ బౌలర్




ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో భాగంగా భారత్, న్యూజిలాండ్ జట్లు ఇవాళ (మార్చి 2) తలపడుతున్నాయి. దుబాయ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ చెలరేగిపోయాడు. ఐదు వికెట్ల ప్రదర్శనతో సత్తా చాటాడు. తద్వారా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌పై ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. అలాగే ఈ మెగా టోర్నీలో భారత్‌పై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు (8-0-42-5) నమోదు చేసిన కివీస్ బౌలర్‌గానూ రికార్డుల్లోకెక్కాడు. ఈ మ్యాచ్‌లో హెన్రీ కీలకమైన శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యా వికెట్లతో పాటు రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ వికెట్లు తీశాడు. స్కోర్ 15 పరుగుల వద్ద ఉండగానే గిల్‌ను ఔట్ చేసిన హెన్రీ భారత్‌ను తొలి దెబ్బ తీశాడు. అనంతరం గత మ్యాచ్ సెంచరీ హీరో విరాట్‌ను ఔట్ చేసి టీమిండియా కష్టాలను మరింత అధికం చేశాడు. ఇన్నింగ్స్ చివర్లో ధాటిగా ఆడుతున్న హార్దిక్‌ను ఔట్ చేసి భారత్ భారీ స్కోర్ చేయకుండా కళ్లెం వేశాడు. ఒక్కో పరుగు కీలకమైన తరుణంలో స్ట్రయిక్ రొటేట్ చేస్తున్న రవీంద్ర జడేజాను ఔట్ చేశాడు. చివరిగా షమీని ఔట్ చేసి కెరీర్‌లో మూడో ఐదు వికెట్ల ఘనతను నమోదు చేశాడు. మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. మ్యాట్ హెన్రీ చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత ఇన్నింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్ (79), అక్షర్ పటేల్ (42), హార్దిక్ పాండ్యా (45) మాత్రమే రాణించారు. భారత టాప్-3 బ్యాటర్లు విఫలమయ్యారు. రోహిత్ శర్మ 15, శుభ్‌మన్ గిల్ 2, విరాట్ కోహ్లి 11 పరుగులు చేశారు. మధ్యలో కేఎల్ రాహుల్ (23) కాసేపు నిలకడగా ఆడాడు. ఆఖర్లో రవీంద్ర జడేజా 16, షమీ 5 పరుగులకు ఔటయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేమీసన్, విలియమ్ రూర్కీ, మిచెల్ సాంట్నర్, రచిన్ రవీంద్ర తలో వికెట్ తీశారు.

## సెమీస్‌లో టీమిండియా ప్రత్యర్థి ఆస్ట్రేలియా.. నాటి పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంటుందా..?





ఛాంపియన్స్ ట్రోఫీ-2025 సెమీఫైనల్లో ఏయే జట్లు తలపడబోతున్నాయో తేలిపోయింది. మార్చి 2 జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై విజయంతో భారత్ గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. తద్వారా సెమీస్‌లో గ్రూప్-బిలో సెకెండ్ ప్లేస్‌లో నిలిచిన ఆస్ట్రేలియాతో అమీతుమీకి సిద్ధమైంది. భారత్, ఆస్ట్రేలియా వన్డే ఫార్మాట్‌లో చివరిసారిగా 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో తలపడ్డాయి. నాటి మ్యాచ్‌లో ఆసీస్ భారత్‌ను ఓడించి జగజ్జేతగా నిలిచింది. దాదాపుగా ఏడాదిన్నర తర్వాత భారత్‌కు ఆసీస్‌పై ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని టీమిండియా సద్వినియోగం చేసుకుంటుందో లేదో వేచి చూడాలి. భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి సెమీఫైనల్ మార్చి 4న దుబాయ్ వేదికగా జరుగనుంది. నేటి మ్యాచ్‌లో ఫలితంతో రెండో సెమీస్‌లో ఎవరెవరు తలపడబోతున్నారో కూడా తేలిపోయింది. భారత్ చేతిలో ఓటమితో న్యూజిలాండ్ గ్రూప్-ఏలో రెండో స్థానంలో నిలిచింది. తద్వారా గ్రూప్-బి టాపర్ అయిన సౌతాఫ్రికాను రెండో సెమీస్‌లో ఢీకొంటుంది. ఈ మ్యాచ్ లాహెూర్ వేదికగా మార్చి 5న జరుగుతుంది. అనంతరం రెండు సెమీఫైనల్స్‌లో విజేతలు మార్చి 9న జరిగే ఫైనల్లో అమీతుమీ తేల్చుకుంటాయి. తొలి సెమీస్‌లో ఆసీస్‌ను ఓడించి టీమిండియా ఫైనల్‌కు చేరితే దుబాయ్ వేదికగా అంతిమ సమరం జరుగుతుంది. ఒకవేళ సెమీస్‌లో టీమిండియా ఆసీస్ చేతిలో ఓడితే లాహెూర్ ఫైనల్ మ్యాచ్‌కు వేదికవుతుంది.

**హ్యాట్రిక్ విజయాలు**

భారత్ గ్రూప్-ఏలో హ్యాట్రిక్ విజయాలు సాధించి అజేయ జట్టుగా సెమీస్‌కు చేరింది. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను మట్టికరిపించింది. చివరిగా ఇవాళ జరిగిన మ్యాచ్‌లో భారత్ న్యూజిలాండ్‌పై ఘన విజయం? సాధించింది. మరోవైపు ఆస్ట్రేలియా ఈ టోర్నీలో ఒకే ఒక మ్యాచ్‌లో విజయం? సాధించినప్పటికీ సెమీస్‌కు అర్హత సాధించింది. గ్రూప్ దశలో ఆఫ్ఘనిస్తాన్, సౌతాఫ్రికా మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దు కాగా.. ఆసీస్ ఇంగ్లండ్‌పై మాత్రమే గెలుపొందింది.

**44 పరుగుల తేడాతో కివీస్‌ను చిత్తు చేసిన టీమిండియా**

గ్రూప్-ఏలో భాగంగా ఇవాళ జరిగిన చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై భారత్ 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేయగా.. ఛేదనలో తడబడిన న్యూజిలాండ్ 45.3 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లు తీసి న్యూజిలాండ్ పతనాన్ని శాశించాడు. కేన్ విలియమ్సన్ (81) న్యూజిలాండ్‌ను గెలిపించేందుకు విఫలయత్నం చేశాడు.

# సినీ ప్రియులకు కిరణ్ అబ్బవరం గిఫ్ట్



సినీ ప్రియులకు బంపర్ ఆఫర్ ఇచ్చారు నటుడు కిరణ్ అబ్బవరం ఆయన నటించిన కొత్త చిత్రం 'దిల్‌రూబా' కథేంటో చెబితే సినిమాలో తాను వాడిన బైక్‌ను బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. అది అంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. ఈ మేరకు ఆ బైక్‌ను చూపిస్తూ నేడు ప్రత్యేక వీడియో షేర్ చేశారు. "కోపం, ప్రేమల సమ్మేళనంగా తెరకెక్కిన చిత్రమే 'దిల్ రూబా'. ఈ బైక్ అంటే నాకెంతో ఇష్టం. మా ఆర్ట్ డైరెక్టర్ ఎంతో శ్రమించి సినిమా కోసం దీనిని తయారు చేశారు. మార్కెట్‌లో ఇది మీకు ఎక్కడా దొరకదు. అందుకే దీనిని మీకు బహుమతిగా ఇచ్చేయాలనుకుంటున్నా. ఈ బైక్‌ను మీ సొంతం చేసుకోవడానికి మీరు చేయాల్సిందల్లా ఒక్కటే.. ఇప్పటివరకూ విడుదలైన మా సినిమా పాటలు, వీడియోలు, ప్రమోషన్స్‌లో మేము మాట్లాడిన విషయాలను ఆధారంగా చేసుకుని కథ ఏమిటనేది మీరు ఆలోచించి చెప్పాలి. క్రియేటివ్‌గా చెప్పిన వాళ్లకు ఈ బైక్ బహుమతిగా ఇస్తా. ఈ బైక్ గెలుచుకున్న వ్యక్తితో ఫస్ట్ డే ఫస్ట్‌షోకు వెళ్తా" అని కిరణ్ చెప్పారు. విశ్వకరుణ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. మార్చి 14న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

# అట్లీతో సినిమా.. అదే సమస్య

అల్లు అర్జున్ తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతోందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. త్వరలో అఫీషియల్‌గా ఈ విషయం బయటకు రానుందని కూడా టక్ నడుస్తోంది. వీరిద్దరి కలయిక అంచనాలు భారీగా ఉంటాయి. ప్రస్తుతం అట్లీ వరుస హిట్‌లతో మంచి ఫామ్‌లో ఉన్నాడు. అయితే.. అట్లీతో ఓ సమస్య వుంది. ఈ మధ్యన ఆయన రెమ్యునరేషన్ రూ.100 కోట్లకు పెంచేశారు. ఇది చూసి బడా నిర్మాతలే వెనక్కు తగ్గుతున్నారు. 'జవాన్' సినిమా తరవాత అట్లీ రేంజ్ మారింది. పుష్ప సినిమాతో అల్లు అర్జున్ రేంజ్ కూడా జాతీయ స్థాయిని దాటుకుపోయింది. ఆయన కూడా రూ. 150 కోట్లు రెమ్యునరేషన్‌లో ఉన్నాడని టాక్ నడుస్తోంది. ఈ సినిమా గీతా ఆర్ట్స్‌లో చేసినా పారితోషికం అయితే ఇవ్వాల్సిందే. అంటే దర్శకుడుకీ, హీరోకీ రూ.250 కోట్లు అయిపోతుంది. బన్నీ మార్కెట్ ఉంద కాబట్టి, ఆమాత్రం ఇవ్వడానికి నిర్మాతలు కూడా సిద్దంగానే ఉంటారు. అయితే అట్లీ రూ.100 కోట్లు ఇచ్చే స్థాయి ఉందా? అన్నది ప్రశ్న. అట్లీకి అంత ఇవ్వలేకే.. తమిళ నిర్మాతలు సైడ్ అయిపోతున్నారు. ఇప్పుడు బన్నీ అట్లీ ప్రాజెక్ట్ ఎవరు తీసుకున్నా.. పారితోషికం దగ్గరే ఇష్యూ వస్తుంది. బన్నీకి ఇవ్వడానికి ఏ నిర్మాత వెనకడుగు వేయడు. అట్లీకి రూ.100 కోట్లు ఇవ్వడమే సమస్య. తమిళ నిర్మాతలే అట్లీని నమ్మకపోతే తెలుగులో ఎవరు నమ్ముతారు? అట్లీకి ఉన్న క్రేజ్‌ను బట్టి డిమాండ్ ఉండటం సహజం. కానీ మరీ రూ.100 కోట్లు అనే సరికి నిర్మాతలు వెనకడుగు వేస్తున్నారు. మరి ఈ సమస్యకు పరిష్కారం ఎలా ఉంటుందో చూడాలి.






# నితిన్ 'రాబిన్‌హుడ్'కి పోటీగా వస్తున్న 'మ్యాడ్ స్క్వేర్'

టాలీవుడ్ హీరో నితిన్ వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్ భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ఈ సినిమా విషయానికి వస్తే.. నితిన్ ఇందులో రాబిన్ హుడ్ అనే దొంగ పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఇదే రోజు మరో క్రేజీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌజ్ సితార ఎంటర్‌టైనమెంట్స్ నుంచి వస్తున్న తాజా ఎంటర్‌టైనర్ మ్యాడ్ స్క్వేర్ "మ్యాడ్" చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. ఈ చిత్రంలో నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా.. మార్చి 28, 2025న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు చిత్రాలు ఒకే సమయంలో రావడంతో బాక్సాఫీస్ వద్ద పోటీ ఉండే అవకాశం కనిపిస్తోంది. అయితే "రాబిన్‌హుడ్" ఒక యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతుండగా.. "మ్యాడ్ స్క్వేర్" యూత్‌ని ఆకట్టుకునే కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతుండడంతో ప్రేక్షకుల ఏ జానర్ నచ్చితే ఆ జానర్‌లో సినిమాకి వెళ్లే అవకాశం కనిపిస్తుంది.

# ఓటీటీలోకి వచ్చేసిన సంక్రాంతికి వస్తున్నాం

విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. మీనాక్షి చౌదరి ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించారు. ఈ సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఒకేసారి అటు టీవీతో పాటు ఓటీటీలో విడుదల చేసింది. జీటీవీలో నిన్న ప్రీమియర్ అయిన ఈ చిత్రం.. ప్రస్తుతం ఓటీటీ వేదిక జీ5లో తెలుగుతో పాటు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com